ప్రజాశక్తి

శనివారం 1 జూన్ 2024

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

కెజిహెచ్ బ్రాండ్ దెబ్బతింటోందా ?

- సూపరింటెండెంట్‌పై ఆరోపణలు
- ఎట్టకేలకు వైద్యాధికారులకు కలెక్టర్ క్లాస్
- పరిస్థితులను చక్కదిద్దేందుకు ప్రయత్నాలు

కెజిహెచ్

వైద్యాధికారులతో సమావేశమైన కలెక్టర్ మల్లికార్జున

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

పేద, బడుగు, బలహీన ప్రజానీకం ఆరోగ్య ప్రదాయిని కెజిహెచ్ అనడంలో ఎటువంటి సందేహమూ లేదు. ఉత్తరాంధ్ర, గోదావరి జిల్లాల నుంచే కాకుండా ఒడిశా రాష్ట్రం నుంచీ వేల మంది రోగులు విచ్చేసి ఇక్కడ సాంత్వన పొందుతారంటే అతిశయోక్తి కాదు. అంతటి బ్రాండ్ ఇమేజ్ ఈ పెద్దాసుపత్రిది. అయితే ఇటీవల చోటుచేసుకున్న పరిణామాలు ఆందోళన కలిగిస్తున్నాయి. సూపరింటెండెంట్‌పై వచ్చిన ఆరోపణలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి.. కెజిహెచ్ సూపరింటెండెంట్‌గా ఉన్న అశోక్ కుమార్ ఓ మహిళా వైద్యాధికారిపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారన్న వార్తలు గుప్పుమన్నాయి. ఈ వ్యవహారం కేసులదాకా వెళ్లింది. ఈ క్రమంలో డాక్టర్ అశోక్‌కుమార్ దీర్ఘకాల సెలవుపై వెళ్లిపోయారు. గతంలోనూ ఇక్కడ వివాదాలున్నా ఈ స్థాయిలో పోలీస్ కేసుల దాకా వెళ్లిన దాఖలాలు అరుదు. తాజా పరిస్థితిపై ఓ అంచనాకు వచ్చిన జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున శుక్రవారం వైద్యాధికారులు, మిగతా 2లో..

కెజిహెచ్ ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్‌గా డాక్టర్ శివానంద

వార్త 2లో..

పింఛన్‌దారులకు ఈసారీ ఇక్కట్లే !

- 71 వేల మందికే ఇళ్ల వద్ద పంపిణీ
- 1.93 లక్షల మందికి బ్యాంకుల్లో సొమ్ము జమ

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

పింఛన్‌దారులకు ఈసారీ ఇక్కట్లు తప్పేలాలేవు. పోలింగ్ పూర్తయినా, ఎన్నికల నిబంధనావళి కొనసాగుతుండటంతో లబ్ధిదారులందరికీ ఇంటింటికి వెళ్లి ఈ నెలలో కూడా పింఛన్ డబ్బులను అందివ్వడం లేదు. జిల్లాలోని 24 మండలాలు, అనకాపల్లి పట్టణం, యలమంచిలి, నర్సీపట్నం పురపాలక సంఘాలతో కలుపుకొని వివిధ రకాల పింఛన్‌దారులు 2,64,526 మంది వున్నారు. వీరికి ప్రభుత్వం నుంచి రూ.77 కోట్లు అందజేయాల్సివుంది. వాలంటీర్లతో లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్ అందజేసే పద్ధతిని నిలిపివేయడంతో ఈ నెల ఒకటి నుంచి గత నెల మాదిరిగానే రెండు పద్ధతుల్లో పింఛన్ సొమ్ము అందనుంది. 2,64,526 మంది పింఛన్‌దారుల్లో 71,177 మందికి రూ.18.99 కోట్లు నగదును అంగన్‌వాడీలు, ఆశాల సహాయంతో సచివాలయ సిబ్బంది లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి అందజేయనున్నారు. ఇంటింటికి వెళ్లి పింఛన్ అందజేసే పని రెండ్రోజుల్లో పూర్తవుతుందని అధికారులు చెబుతున్నారు. వీరిలో దాదాపు 42 వేల మంది వికలాంగులతో పాటు మంచం కదలి రాలేనివారు, ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నవారున్నారు. ఈ తరహా లబ్ధిదారులకు నేరుగా పింఛన్ సొమ్ము ఇవ్వనున్నారు. మిగిలిన 1,93,349 మంది పింఛన్‌దారులకు రూ.77 కోట్లును వారి బ్యాంకు ఖాతాలో ప్రభుత్వం జమచేసింది. ఈ పింఛన్ సొమ్ము లబ్ధిదారులు బ్యాంకుల ద్వారా పొందాల్సివుంది. ఈ క్రమంలో గత నెలలో వలే ఈసారీ బ్యాంకుల వద్ద క్యూలైన్లలో పింఛనుదారులు బారులుతీరే అవకాశముంది.

ఒపిఎస్‌ను పునరుద్ధరించాలి

వార్త 2లో..

'ఉక్కు' కార్మికుల జీతాలు సకాలంలో చెల్లించాలి

వార్త మెయిన్‌లో..

జవహర్ రెడ్డి మా భూముల్లోకి వచ్చారు

వార్త మెయిన్‌లో..

మాట్లాడుతున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

నేటి నుంచి 144 సెక్షన్

- లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తి
- 3 నుంచి మద్యం షాపుల బంద్
- ఫలితాల రోజు ర్యాలీలపై నిషేధం
- తరువాతా అనుమతి తప్పనిసరి
- అనకాపల్లి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి రవి పట్టాన్‌శెట్టి

వార్త 2లో..

'ఉపాధి' కూలీలకు

రోజు వేతనం రూ.600 ఇవ్వాలి

ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ముర్రాపు సూర్యనారాయణ

ఉపాధి హామీ కూలీలతో కలిసి నినాదాలు చేస్తున్న సూర్యనారాయణ, తదితరులు

ప్రజాశక్తి - మునగపాక : గ్రామీణ ఉపాధి హామీ కూలీలకు కనీస వేతనం రోజుకు రూ.600 ఇవ్వాలని, 200 పని దినాలు కల్పించాలని ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ముర్రాపు సూర్య నారాయణ డిమాండ్ చేశారు. ఆయన మండలంలోని పాటిదిబ్బ, పూరీటిగెడ్డ ప్రాంతాలలో జరుగు తున్న కాలువ పనులను శుక్రవారం పరిశీలించారు. ఉపాధి కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2006లో ప్రారంభమైన ఉపాధి హామీ చట్టం 18 సంవత్సరాలు పూర్తి కావొస్తున్నా పాలకుల తీరుతో అరకొరగానే నడుస్తోందన్నారు. ఎండలో పని చేస్తున్న కార్మికులకు మంచినీరు, టెంట్లు, మజ్జిగ వంటి సౌకర్యాల కల్పనలో ప్రభుత్వం వైఫల్యం చెందిందన్నారు. ఉపాధి కూలీలకు ప్రభుత్వం ఇస్తున్న అరకొర ఆదాయంతో వారి కనీస అవసరాలు కూడా తీరడం లేదన్నారు. ప్రారంభంలో ఉపాధి హామీ పనులకు రూ.90 వేల కోట్లు కేటాయించిన కేంద్ర ప్రభుత్వం తర్వాత కాలంలో దానిని రూ.60 వేల కోట్లకు, మిగతా 2లో..

జోహార్లు

కార్మిక ఉద్యమనేతగా అలుపెరగక తుదిశ్వాస వరకు పోరాడిన ఆదర్శనేత, ఎంత కష్టమైనా పోరాడి సాధించి ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానం పొందిన కా॥ యల్లపు తులసి గారికి అరుణాంజలి ఘటిస్తూ.. మీ కుటుంబ సభ్యులకు మా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ...

కామ్రేడ్ యల్లపు తులసి గారు

అధ్యక్షురాలు, ఎ.పి. అంగన్‌వాడీ వర్కర్స్ & హెల్పర్స్ యూనియన్ (CITU) విశాఖ జిల్లా కమిటీ

ఉపాధ్యక్షురాలు, (CITU) విశాఖ జిల్లా కమిటీ

జననం : 07-07-1973 మరణం : 21-05-2024

ఎ.పి. అంగన్‌వాడీ వర్కర్స్ & హెల్పర్స్ యూనియన్ (CITU)

విశాఖ జిల్లా కమిటీ

మొదటి పేజీ తరువాయి..

కెజిహెచ్ బ్రాండ్ దెబ్బతింటోందా ?

సిబ్బందికి క్లాస్ తీసుకున్నారు. పరిస్థితులను చక్కదిద్దే ప్రయత్నం చేశారు. దారితప్పితే వేటు తప్పదంటూ వైద్యాధికారులను, సిబ్బందిని హెచ్చరించారు.

చాపకింద నీరులా వాతావరణం కలుషితమవుతోందా ?

కెజిహెచ్‌లోని కొంతమంది వైద్యాధికారుల తీరు, ఆధిపత్య ధోరణులూ ఆసుపత్రి ప్రతిష్టను దిగజారుస్తున్నాయి. తాజాగా వెలుగుచూసిన వ్యవహారం మాయని మచ్చనే తెచ్చిపెట్టింది. కెజిహెచ్ సూపరింటెండెంట్ అశోక్‌కుమార్ లైంగిక వేధింపులకు గురిచేశారని నర్సింగ్ సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న జె.విజయలక్ష్మి ఆరోపించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఆ విషయం పోలీస్ కేసు దాకా వెళ్లడం, డైరెక్టర్ మెడికల్ ఎడ్యుకేషన్ (అడ్మినిస్ట్రేటివ్ స్టేట్ బాడీ) అధికారుల విచారణ చేపట్టడం చకచకా జరిగిపోవడం అందరికీ ఎరుకే. గతంలో ఎంతో మంచి వాతావరణం కలిగి ఉన్న కెజిహెచ్‌లో కొంతమంది తీరుతో చాపకింద నీరులా ఆ వాతావరణం కలుషితమవుతోందన్న విమర్శలూ వినిపిస్తున్నాయి.

ప్రజలకు విశ్వాసం పెంచేలా పరిస్థితులు అభివృద్ధి కావాలి

పెద్దాసుపత్రి కెజిహెచ్ బ్రాండ్ విలువను రక్షించాలి. ఆసుపత్రికి విచ్చేసే ప్రజలకు విశ్వాసం కలిగించేలాగ పరిస్థితులు ఇంకా అభివృద్ధి కావాల్సి ఉంది. కెజిహెచ్ సేవల్లో ఎంతగానో అభివృద్ధి చెందింది. ఇక్కడున్న స్పెషల్ డిపార్టుమెంట్‌లు, వైద్యులు, నర్సింగ్ స్టాఫ్ ఎక్కడా ఉండరు. రెండు వేల వరకూ బెడ్స్ ఇక్కడ ఉన్నాయి. బడుగు, బలహీన, పేద తరగతుల వారిని దూరం చేసే చర్యలకు ఎవ్వరూ పాల్పడకూడదు. పలానా ఆసుపత్రి, డాక్టర్ మంచివారయితేనే కదా ప్రజలు అక్కడకు వచ్చేది. ఇప్పుడు చోటుచేసుకుంటున్న పరిణామాలు వంటివి జరిగితే కొంతకాలం ప్రజలు ఆసుపత్రిని దూరం పెట్టే ప్రమాదం ఉంది.

కె.అర్జున్, కెజిహెచ్ మాజీ సూపరింటెండెంట్

శివానందకు అభినందనలు తెలుపుతున్న వైద్యులు, సిబ్బంది

కెజిహెచ్ ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్‌గా డాక్టర్ శివానంద బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కెజిహెచ్ ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్‌గా డాక్టర్ శివానంద నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగా జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున శుక్రవారం ఉత్తర్వులిచ్చారు. ఆర్థోపెడిక్ విభాగ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న డాక్టర్ శివానంద గతంలో కెజిహెచ్ సూపరింటెండెంట్‌గానూ పని చేశారు. ఉత్తర్వులు అందగానే శివానంద బాధ్యతలు స్వీకరించారు. సహచరులంతా ఆయనకు సాదరంగా స్వాగతం పలికి పుష్పగుచ్ఛాలిచ్చి అభినందనలు తెలిపారు.

ఇబ్బందికర పరిస్థితులే అయినా అధిగమిస్తాను

'ఇబ్బందికర పరిస్థితుల మధ్యనే ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్‌గా విధుల్లో చేరాను. బాధ్యతగా సేవలు అందిస్తాను. ప్రస్తుతం కెజిహెచ్‌పై వస్తున్న ఆరోపణలు, వివాదాలు కొంచెం ఇబ్బంది కలిగించేవే. ఇలాంటి పరిస్థితులు రాకుండా నా వంతు కృషిచేస్తాను సవాళ్లన్నిటినీ అధిగమించి కెజిహెచ్ సేవలను మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్తాను' అని శివానంద తెలిపారు.

రోజు వేతనం రూ.600 ఇవ్వాలి

ఇప్పుడు రూ.48 వేల కోట్లకు కుదించడం అన్యాయమన్నారు. ఉపాధి కూలీలకు 200 రోజులు పని దినాలు కల్పించడం మూలంగా కేంద్ర ప్రభుత్వానికి రెండు లక్షల కోట్లు ఖర్చు అవుతుందని తెలిపారు. దేశంలోని శతకోటీశ్వరులైన 12 మందికి రూ.16 లక్షల కోట్లు రుణమాఫీ చేసిన మోడీ ప్రభుత్వానికి ఈ ఖర్చు ఏమాత్రమని అన్నారు. సుప్రీంకోర్టు తీర్పును ప్రభుత్వాలు గౌరవించి కనీస వేతనం రోజుకు 600 ఇవ్వాలని, ప్రమాద బీమా రూ.5 లక్షలు చెల్లించాలని, పనిముట్లకు అద్దె ఇవ్వాలని, పని ప్రదేశంలో ప్రమాదాల బారిన పడిన వారికి మెరుగైన వైద్య సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం చెరుకు రైతు పెంటకోట రాము బెల్లం తయారీ విధానాన్ని సూర్యనారాయణ పరిశీలించారు. చెరుకు పండించడం ద్వారా వచ్చే ఆదాయ, వ్యయాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏపి రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కర్రి అప్పారావు, ఎం.అప్పలరాజు, సిఐటియు మండల కన్వీనర్ ఎస్.బ్రహ్మాజీ, కౌలు రైతు సంఘం జిల్లా నాయకులు టెక్కలి జగ్గారావు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : అచ్యుతాపురం మండలంలోని పెదపాడు గ్రామంలోనూ మర్రాపు సూర్యనారాయణ పర్యటించి ఉపాధి హామీ కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీకి కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌ను పెంచాలని డిమాండ్ చేశారు. కూలీలకు మౌలిక సౌకర్యాలు కల్పించి, రోజుకు ఎంత కూలి పడుతుందో పే స్లిప్పులు గతంలో మాదిరి ఇవ్వాలన్నారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధి కూలీలను ఐక్యం చేసి పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.రాము, శ్రీనివాసరావు, తిరుపతమ్మ, కోదండమ్మ, రామలక్ష్మి పాల్గొన్నారు.

సత్యనారాయణ సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ పోర్టు ఉద్యోగిగా, నాయకునిగా కూన సత్యనారాయణ అందించిన సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. విశాఖ పోర్టులో 32 సంవత్సరాలు పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన కె.సత్యనారాయణ అభినందన సభ మెరైన్ డిపార్ట్‌మెంట్‌లో సిఐటియు పోర్ట్ యూనియన్ కార్యదర్శి బి.జగన్ అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ముఖ్య వక్తలుగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, డ్రెడ్జింగ్ సూపర్‌వైజర్ వేణుగోపాల్, హెచ్‌ఎం తివారీ, పోర్టు యూనియన్ నాయకులు కెఎస్.కుమార్, బి.లక్ష్మణరావు, జె.సత్యనారాయణ, సాంబమూర్తి, సిహెచ్.త్రినాధరావు, ఈశ్వరరావు, మురళీకృష్ణ హాజరయ్యారు. సత్యనారాయణ భార్య పార్వతి, కుటుంబ సభ్యులు, అశ్విని, రాంప్రసాద్, ఉదయ్, ఉపేంద్ర, కృష్ణవేణి, త్రివేణి, వర్ధన్ తదితరులు పాల్గొని అభినందనలు తెలిపారు. .

తొలుత వేణుగోపాల్, తివారీ మాట్లాడుతూ సంస్థ కోసం నిజాయితీగా సత్యనారాయణ పనిచేసారన్నారు. క్రమశిక్షణ, నిబద్ధతతో కూడిన కార్మిక నాయకునిగా మెలిగారన్నారు. అధికారులతో చాలా ఓర్పుగా మాట్లాడి సమస్యలు పరిష్కారం చేసేవారన్నారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కుమార్ మాట్లాడుతూ పోర్టులో యునైటెడ్ పోర్టు అండ్ డాక్ వర్కర్స్ యూనియన్ చేసిన ఎన్నో పోరాటాల్లో సత్యనారాయణ భాగస్వాములయ్యారన్నారు. నిరంతరం కార్మికుల సమస్యలపై కరపత్రాలు పంచడం వల్ల సస్పెండ్‌కు కూడా గురయ్యారన్నారు. అయినప్పటికీ యూనియన్‌ని వదలకుండా రెట్టింపు ఉత్సాహంతో పనిచేశారన్నారు. యూనియన్ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తించారన్నారు. ఆయన పోరాట ప్రస్థానాన్ని తెలియజేశారు.

సత్యనారాయణ ఉద్యోగ విరమణ సభలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కుమార్

నేటి నుంచి 144 సెక్షన్

అనకాపల్లి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి రవి పట్టాన్‌శెట్టి

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

జూన్ 4న జరగనున్న ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎటువంటి అల్లర్లూ చోటుచేసుకోకుండా జిల్లా వ్యాప్తంగా శుక్రవారం అర్ధరాత్రి నుంచి 144 సెక్షన్ అమల్లోకి తెచ్చినట్లు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి రవి పట్టాన్‌శెట్టి తెలిపారు. శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యల్లో భాగంగా 144 సెక్షన్ విధించినట్లు వెల్లడించారు. శుక్రవారం తన ఛాంబర్‌లో తనను కలిసిన విలేకరులతో ఆయన మాట్లాడుతూ లెక్కింపు రోజుగానీ, తరువాతగానీ అల్లర్లు జరగకుండా మండల స్థాయిలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో తహశీల్దార్లు కమిటీలు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. జిల్లాలో గుర్తించిన వివాదాస్పద గ్రామాలపై ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. లెక్కింపునకు అవసరమైన అన్ని ఏర్పాట్లూ చేశామన్నారు. లెక్కింపు పారదర్శకంగా జరిగేలా అన్ని చర్యలూ తీసుకున్నామన్నారు. లెక్కింపు రోజు విజయోత్సవ ర్యాలీలు నిర్వహించకూడదన్నారు. తరువాత కూడా ర్యాలీలకు అనుమతి తప్పనిసరని తెలిపారు. మందుగుండు సామగ్రి తయారీ, పేలుళ్లపై నిషేధం విధించామన్నారు. వైన్‌షాపులు మూడో తేదీ మధ్యాహ్నం నుంచి ఐదో తేదీ వరకు తెరవకూడదన్నారు. శనివారం ఎగ్జిట్‌పోల్స్ రానున్నందున పోలీసులు అప్రమత్తంగా ఉండాలన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగితే ఉపేక్షించేది లేదన్నారు. ఎన్నికల నిబంధనలకు కట్టుబడి లెక్కింపు ప్రశాంతంగా జరగడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. లెక్కింపు కేంద్రాల్లోకి వెళ్లే సిబ్బంది, అధికారులెవరూ లోపలకు పెన్ను, సెల్‌ఫోన్, స్మార్ట్ వాచ్ వంటివి తీసుకెళ్లకూడదని స్పష్టమైన సూచనలు చేశామన్నారు. లెక్కింపునకు సంబంధించి మెటీరియల్‌ను కేంద్రాల్లోనే అందజేస్తామన్నారు. అభ్యర్థులకు వచ్చిన ప్రతి సందేహాన్ని నివృత్తిచేస్తున్నామన్నారు. లెక్కింపు రోజు కూడా నివృత్తిచేస్తామన్నారు. లెక్కింపు ప్రశాంతంగా ముగిసేలా సహకరించాలని జిల్లా ప్రజలను ఆయన కోరారు.

ఒపిఎస్‌ను పునరుద్ధరించాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : సిపిఎస్, జిపిఎస్‌లను రద్దు చేసి ఒపిఎస్‌ను పునరుద్ధరించాలని శుక్రవారం సాయంత్రం మహారాణిపేటలోగల పెన్షనర్ల అసోసియేషన్ భవనంలో జరిగిన విశాఖ, అనకాపల్లి, పాడేరు జిల్లాల పెన్షనర్ల సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానించింది. సమావేశానికి ఐక్యవేదిక రాష్ట్ర చైర్మన్ కెఆర్.సూర్యనారాయణ ప్రధాన వక్తగా హాజరై మాట్లాడారు. 12వ పిఆర్‌సిని తక్షణమే అమలు చేయాలన్నారు. డిఎలను సకాలంలో చెల్లించాలన్నారు.

రూ.25 వేల కోట్లకుపైగా ఉన్న పెండింగ్ పిఆర్‌సి, డిఎ, ఎస్‌ఎల్‌ఎస్, ఎపిజిఎల్ఐ బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రతినెలా ఒకటో తేదీనే జీతాలు, పెన్షన్ల చెల్లింపు విధానాన్ని చట్టబద్ధం చేయాలన్నారు. సమావేశంలో ఐక్యవేదిక నాయకులు ఎస్‌వి.రమణ, సిహెచ్.రాజేశ్వరి, కె.బాబూరావు, కృష్ణమోహన్, ఆర్.శ్రీనివాసరావు, ఉమామహేశ్వరరావు, కె.హరికృష్ణ, కేదారేశ్వరరావు, పాపారావు, మాగంటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జివిఎంసిలో పలువురు ఉద్యోగ విరమణ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రతి ఉద్యోగికీ ఉద్యోగ విరమణ తప్పనిసరి అని జివిఎంసి అదనపు కమిషనర్ డాక్టర్. వి.సన్యాసిరావు పేర్కొన్నారు. విధి నిర్వహణలో అందరి మన్ననలూ అందుకొని ఉద్యోగ విరమణ పొందిన జివిఎంసిలోని పలు హోదాలలో పనిచేస్తున్న 15 మంది ఉద్యోగులను శాలువ, పూలమాలలతో ఆయన సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉద్యోగ విరమణ అనంతరమూ శేష జీవితాన్ని ఆనందదాయకంగా గడపాలని ఆకాంక్షించారు. తాజాగా ఉద్యోగ విరమణ పొందిన సూపరింటెండెంట్ ఎంఎల్ నర్సింగరావు, సీనియర్ అసిస్టెంట్ శాస్త్రి, జూనియర్ అసిస్టెంట్ మంగతాయారు, రికార్డు అసిస్టెంట్లు ఎన్.వెంకటేశ్వర రాజు, రమణమ్మ, టిపిబి జనార్ధనరావు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, ఆఫీస్ సబార్డినేటర్ నాగేశ్వరరావు, మజ్దూర్ రాము, పిహెచ్ మేస్త్రీలు ఆదినారాయణ, కుమారి, కోమల, ఆదిలక్ష్మి, అప్పలనాయుడు జివిఎంసిలో వారి విధులను చిత్తశుద్ధితో నిర్వహించారని, వారి సేవలు ఇతర ఉద్యోగులకు ఆదర్శంగా నిలుస్తాయని అన్నారు. కార్యక్రమంలో జివిఎంసి డిప్యూటీ ప్రాజెక్ట్ ఆఫీసర్ ఎంవిడి.ఫణిరామ్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పి.పద్మజ, ఎపిఎం ఇఎస్ఎ కార్యవర్గ సభ్యులు అప్పలరాజు, జెమ్స్ ప్రెసిడెంట్ అప్పలనాయుడు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ చేసిన వారిని సత్కరిస్తున్న అధికారులు

IN THE HON'BLE COURT OF THE VI ADDL. SENIOR CIVIL JUDGE AT: VISAKHAPATNAM
E.P. 141/2021 in O.S.2095/2014

Between:
Akoju Srinivasu ...D.Hr/Plaintiff
And:
Gutthi Krishna Murthy ...J.Dr/Defendant

SALE NOTICE

It is to inform the general public that the below mentioned E.P. Schedule Property is kept for sale in the public auction as per the orders of the Hon'ble Court i.e. to be conducted on **18-06-2024** at **10:30 A.M. to 5:00 P.M.** before the above stated Hon'ble Court. The public who are interested to participate in the public auction are directed to appear before the Hon'ble Court on that day in order to participate in the auction.

E.P. SCHEDULE OF PROPERTY

A 340 Sft. House bearing D.No.22-104-5, an undivided extent of 12.63 Sq. yds in 36 Sq. yds in ground floor situated in Thummalapalli Vari Veedhi, Seetharamaswamy Temple area, Chengalraopeta Ward, Visakhapatnam, GVMC limits within the following boundaries:
East : Joint property,
South: Municipal C.C. Road,
West : House bearing D.No.22-104-4,
North: Share property of Gutti Bala Subramanyam.

DHR Value: Rs. 7,00,000/-
Amin Value Rs. 8,01,500/-
JDR Value: Not known.
(By Order of the Hon'ble Court)
CH. BHASKARA RAO, Advocate
Visakhapatnam, Cell: 9246622527.

అభివృద్ధికి నోచని జూనియర్ కళాశాల

జూనియర్ కళాశాలకు కేటాయించిన స్థలం

- ఐదేళ్లు గడిచినా నిర్మాణానికి నోచని వైనం
- నేటికీ హైస్కూల్‌లోనే తరగతులు

ప్రజాశక్తి-ఆనందపురం : మండల కేంద్రమైన ఆనందపురం జిల్లా పరిషత్ హైస్కూల్ ఆవరణలో ఐదేళ్ల క్రితం ఏర్పాటుచేసిన ప్రభుత్వ జూనియర్ కళాశాల అభివృద్ధికి నోచుకోలేదు. మండలంలోని 11 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు ఉండగా 10వ తరగతి పూర్తయిన విద్యార్థులు ఇంటర్ చదివేందుకు స్థానికంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల లేదు. దూరాభారంలో ఉన్న కళాశాలలకు వెళ్లలేక కొంతమంది విద్యార్థులు స్థానికంగా ఉన్న ప్రైవేటు కళాశాలను ఆశ్రయించేశారు. విద్యార్థులు తల్లిదండ్రుల విజ్ఞప్తి మేరకు 2019లో ప్రభుత్వ జూనియర్ కళాశాలను ప్రభుత్వం మంజూరుచేసింది. ఇందుకోసం ఆనందపురం సర్వేనెంబర్ 276 పార్ట్‌లో 2.50 ఎకరాల ప్రభుత్వ భూమిని కళాశాలకు కేటాయించారు. తాత్కాలికంగా ఆనందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఒక భవనాన్ని కేటాయించి జూనియర్ కళాశాలను ప్రారంభించారు. అంతవరకు బాగున్నప్పటికీ ఇప్పటి కూడా ఈ కళాశాలకు కేటాయించిన భూమిలో భవనాలను నిర్మించలేదు. తాత్కాలికంగా హైస్కూల్లో నిర్వహిస్తున్నా కళాశాలకు కావలసిన వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం రెండు గదుల్లోనే ఇంటర్ మొదటి, ద్వితీయ సంవత్సరం అన్ని గ్రూపుల విద్యార్థులకు బోధన చేయాల్సిన పరిస్థితి ఉంది. దీనివల్ల విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కళాశాలలో ఎంపిసి, సిఇసి, హెచ్ఇసి కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఒక టైపిస్టు, ఎనిమిది మంది గెస్ట్ అధ్యాపకులు ఉన్నారు. మధురవాడ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఇక్కడ ఇంచార్జి ప్రిన్సిపాల్‌గా వ్యవహరిస్తున్నారు. కళాశాల ప్రారంభించిన మొదటిలో విద్యార్థుల అధిక సంఖ్యలో ప్రవేశాలు పొందినప్పటికీ వసతులు కొరతతో రానురానూ కళాశాలకు చేరేందుకు విద్యార్థులు ఆసక్తి చూపించకపోవడంతో ప్రస్తుతం విద్యార్థుల సంఖ్య గణనీయంగా పడిపోయింది.

వసతులను మెరుగుపరిస్తే...

ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వసతులు మెరుగుపరిచినట్లయితే ఇంటర్‌లో చేరే విద్యార్థులు అధికసంఖ్యలో పెరుగుతారని పలువురు భావిస్తున్నారు. ఇక్కడ వసతుల కొరవడడంతో తప్పనిసరి పరిస్థితుల్లో తల్లిదండ్రులు ప్రైవేటు కళాశాలల్లో చేర్పిస్తున్నారని చెబుతున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వసతుల మెరుగుపరిచితే టెన్త్ పూర్తయిన విద్యార్థులకు ఇంటర్ విద్య అందుబాటులో ఉంటుందని పలువురు భావిస్తున్నారు.

కళాశాలలో ప్రవేశాలు

ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాలు జరుగుతున్నాయని ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ కృష్ణవేణి తెలిపారు. కళాశాలలో టైపిస్ట్‌తో పాటు ఎనిమిది మంది గెస్ట్ అధ్యాపకులు ఉన్నారని, విద్యా బోధనకు ఏటువంటి ఇబ్బంది లేదని తెలిపారు.

రోడ్డుపై దుకాణాలు తొలగిస్తున్న టౌన్ ప్లానింగ్, ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది

రోడ్లపై దుకాణాల తొలగింపు

ప్రజాశక్తి -తగరపువలస : స్థానిక మెయిన్ రోడ్డుకు ఆనుకుని ప్రైవేట్ మార్కెట్, ఇతర ప్రాంతాల్లో రోడ్డుకిరువైపులా ట్రాఫిక్‌కు అంతరాయం కలిగేలా ఉన్న దుకాణాలను జివిఎంసి పట్టణ ప్రణాళిక విభాగం, ట్రాఫిక్ పోలీసులు సంయుక్తంగా శుక్ర వారం తొలగించారు. పట్టణ ప్రణాళిక విభాగం కార్యదర్శి బి.రేష్మ, సాయి గోపాల్, ట్రాఫిక్ ఎస్సై చిరంజీవి పాల్గొన్నారు.

ఎల్‌వి.పాలెంలో ఆరోగ్య సురక్ష

ప్రజాశక్తి- ఆనందపురం : ఆనందపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధి లోడగలవానిపాలెం గ్రామంలో శుక్రవారం ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఎల్‌వి.పాలెం గ్రామం, దాని పరిసర ప్రాంతాలకు చెందిన 211 మంది ఈ వైద్య శిబిరంలో చికిత్స పొందారు. స్పెషలిస్ట్ వైద్యులు డాక్టర్ అఖిల, డాక్టర్ సుమంత్, ఆనందపురం పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ ఎం.గంగునాయుడు, వైద్య అధికారి షహనాజ్ సాధియ వైద్య సేవలందించారు. దీర్ఘకాలిక వ్యాధి గ్రస్తులకు చికిత్స చేశారు. వేసవిలో ఎలాంటి ఆరోగ్య జాగ్రతలు తీసుకోవాలో ఎంఎల్‌హెచ్‌పిలు ప్రజలకు ఆరోగ్య విద్య బోధించారు. సామాజిక ఆరోగ్య అధికారి పి.సాంబమూర్తి, ఆరోగ్య పర్యవేక్షకులు పార్వతమ్మ, కృష్ణమోహన్, సచివాలయం కార్యదర్శి జీవన్‌లత, టిబి యూనిట్ సూపర్‌వైజర్లు వీరబ్రహ్మం, సురేష్, ఆరోగ్య కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు

ఈశ్వరరావు సేవలు స్ఫూర్తిదాయకం

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సీనియర్ సహాయకులు ఈశ్వరరావు సేవలు స్ఫూర్తిదాయకం అని జిల్లా వైద్య శాఖ కార్యాలయం పరిపాలన అధికారి సుమతి అన్నారు. ఈశ్వరరావు ఉద్యోగ విరమణ సందర్భంగా పిహెచ్‌సిలో శుక్రవారం ఆయనను అధికారులు, సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సుమతి మాట్లాడుతూ, ఉద్యోగ విధుల్లో ఈశ్వరరావు ఖచ్చితంగా ఉండేవారన్నారు. పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ ఎం.గంగునాయుడు మాట్లాడుతూ, ఈశ్వరరావు సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి షహనాజ్ సాధియా, సూపరింటెండెంట్ దుర్గాప్రసాద్, సీనియర్ సహాయకులు ప్రభాకర్, సామాజిక ఆరోగ్య అధికారి పి.సాంబమూర్తి, ఆరోగ్య పర్యవేక్షకులు కృష్ణమోహన్, పార్వతమ్మ, ల్యాబ్ టెక్నీషియన్ ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పలువురికి ఆర్థిక సహాయం

ప్రజాశక్తి-ఆనందపురం : ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పలువురు నిరుపేదలకు ఓఎస్ ఫౌండేషన్, మై బెస్ట్ ఫర్ ఎవర్ టీం, బ్రాహ్మణతర్లా హెల్పింగ్ వారియర్స్, వెంపాడ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యాన రూ.80 వేలు ఆర్థికసహాయం అందజేశారు. ఈ స్వచ్ఛంద సంస్థల ద్వారా వాట్సాప్ స్టేటస్‌లు, వాట్సాప్ గ్రూపుల ద్వారా స్నేహితులు, సుపరిచితులు, బంధువులు అందరికీ విషయాన్ని తెలియజేసి రూ.80 వేలు సమకూర్చారు. ఈ మొత్తాన్ని ఆరిలోవ ఒమేగా హాస్పిటల్‌లో కేన్సర్‌తో చికిత్స పొందుతున్న ఐదేళ్ల బాలుడు గండిబోయిన సాయిగణేష్‌కు రూ.10 వేలు, మరో ప్రాంతంలో కారు ప్రమాదంలో ఎడమ కాలు తీసివేయడంతో చిన్న పిల్లలతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న శ్యామ్ కుటుంబానికి రూ.20 వేలు, గుర్ల గ్రామానికి చెందిన విద్యార్థి వెంకటలక్ష్మి ఆటోలో ప్రయాణం చేస్తూ ప్రమాదానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆ అమ్మాయి కుటుంబానికి రూ.50 వేలు ఆర్థిక సహాయం అందించారు. ఈ మొత్తాన్ని హాస్పిటల్ యాజమాన్యానికి బిల్లు రూపంలో అందించారు. ఈ సందర్భంగా ఓఎస్‌జి ఫౌండేషన్ ఫౌండర్ శివ దళాయి మాట్లాడుతూ, మరిన్ని స్వచ్ఛంద సంస్థలు ముందుకొచ్చి సాయం అందించాలని కోరారు. సభ్యులు గోవింద్, సురేష్, మనోజ్, హరి, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సహాయాన్ని అందిస్తున్న స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

ప్రజాశక్తి -మధురవాడ : రుతు పరిశుభ్రత వారోత్సవాల ముగింపు సందర్భంగా నగరానికి చెందిన రూరల్ డెవలప్‌మెంట్ వెల్ఫేర్ సొసైటీ (ఆర్‌డబ్ల్యూఎస్) సేవా సంస్థ ఆధ్వర్యాన రాజీవ్ గృహకల్ప మారికవలస కాలనీలోని యుక్త వయస్సు బాలికలకు, మహిళలకు రుతుక్రమం, పరిశుభ్రతపై శుక్రవారం అవగాహన కల్పించారు. రుతు పరిశుభ్రత పాటించడం ఎంత ముఖ్యమో సేవా సంస్థ డైరెక్టర్ డాక్టర్ ఊహ మహంతి వివరించారు. శారీరక పరిశుభ్రత పాటించడం ద్వారా రుతుక్రమంలో సంభవించే వ్యాధులు, ఇన్ఫెక్షన్లు నుండి ఎలా తప్పించుకోవాలో వివరించారు. రుతు క్రమంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రుతు రుమాళ్లను సరిగా ఉపయోగించడం తదితర అంశాలపై వివరించారు. అనంతరం రుతు రుమాళ్లను ఉచితంగా పంపిణీ చేశారు.

మందుగుండు సామగ్రి స్వాధీనం

ప్రజాశక్తి- భీమునిపట్నం : మండలంలోని గొల్లల తాళ్లవలసలో ఓ రేకుల షెడ్‌లో నిల్వ ఉంచిన మందుగుండు సామగ్రిని పోలీసులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. అందిన సమాచారం మేరకు నగర టాస్క్ ఫోర్స్ ఎస్ఐ భరత్‌కుమార్, భీమిలి సిఐ డి.రమేష్ సిబ్బందితో కలిసి మండలంలోని గొల్లల తాళ్లవలసలో ఓ రేకుల షెడ్డులో ప్రభుత్వ లైసెన్స్ లేకుండా నిల్వ ఉంచిన సుమారు లక్ష రూపాయల విలువ గల మందు గుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు స్వాధీనం చేసుకున్న వాటిలో సీమ టపాసులు, బెల్ట్, రాకెట్ బాంబులు తదితరాలు ఉన్నాయి. మందుగుండు సామగ్రి ని నిల్వ ఉంచిన భీమిలికి చెందిన కొక్కిరి అప్పన్నను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సిఐ రమేష్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

వాంబే కాలనీలో కార్డన్ సెర్చ్

ప్రజాశక్తి -మధురవాడ : పోతిన మల్లయ్యపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలోని వాంబే కాలనిలో శుక్రవారం తెల్లవారు జామునుంచి పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ముమ్మర తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా డీసీపీ-1 లక్ష్మినారాయణ, నార్త్ జోన్ ఏసీపీ సునీల్ మాట్లాడుతూ, తెల్లవారుజామున 3 గంటల నుంచి 3 టీములుగా వాంబే కాలనీలో ఉన్న ప్రతి గడపనూ ముమ్మరంగా తనిఖీ చేశామని చెప్పారు. ఈ తనిఖీల్లో ఎటువంటి పత్రాలూ లేని 25 వాహనాలను సీజ్ చేశామని తెలిపారు. రౌడీషీటర్లపైనా, అనుమానిత వ్యక్తులపైనా ప్రత్యేక దృష్టి ఎప్పుడూ ఉంటుందన్నారు. జూన్ 4 కౌంటింగ్ కారణంగా పిఎం పాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న ప్రాంతాలలో ప్రతి రోజూ ఏదో ఒక ప్రాంతంలో తనిఖీలు చేస్తున్నట్లు వివరించారు. ముఖ్యంగా మద్యం, గంజాయి ఎక్కడా లేకుండా చూడటమే లక్ష్యమన్నారు. ఈ కార్డన్ సెర్చ్‌లో సుమారు 45 మంది సిబ్బంది పాల్గొన్నారు. జూన్ 3, 4, 5 తేదీల్లో 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. పిఎం.పాలెం పోలీస్ స్టేషన్ పరిధి మల్లయ్యపాలెం, ఎండాడ, మారికవలస, ఆర్‌హెచ్ కాలనీ, వాంబే కాలనీలపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. స్థానిక నాయకులను పిలిచి కౌన్సెలింగ్ ఇచ్చినట్లు చెప్పారు. స్టేషన్ పరిధిలో ఇప్పటి వరకు 37 ఎక్సైజ్ యాక్ట్‌లు వేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐ వై.రామకృష్ణ, ఎస్ఐలు సురేష్, సునీత, సుదర్శన్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

కార్డన్ సెర్చ్‌లో పాల్గొన్న పోలీసులు

కేంద్రకారాగారాన్ని సందర్శించిన జైళ్ల శాఖ ఐజి

కృష్ణారావు అభినందన సభలో ఐజి డాక్టర్ ఇండ్ల శ్రీనివాసరావు

ప్రజాశక్తి - ఆరిలోవ : విశాఖ కేంద్రకారాగారాన్ని ఆంధ్రప్రదేశ్ జైళ్లశాఖ ఐజి డాక్టర్ ఇండ్ల శ్రీనివాసరావు శుక్రవారం సందర్శించారు. ఖైదీలు ఉండే అన్ని బ్యారక్‌లను పరిశీలించారు. జైల్లో కల్పిస్తున్న సౌకర్యాలు, ఆహారం, మౌలిక వసతులపై స్వయంగా ఖైదీలనడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన సబ్ జైల్ డిప్యూటీ సూపరింటెండెంట్‌గా ఉద్యోగ విరమణ చేసిన బత్తిలి కృష్ణారావు అభినందన సభలో పాల్గొన్నారు. కృష్ణారావు చేసిన సేవలను ఆయన అభినందించి శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జైళ్ళశాఖ అధికారులు ఎస్.రాహుల్, ఎం.వెంకటేశ్వర్లు, విశాఖ కేంద్రకారాగారం పర్యవేక్షణాధికారి కిషోర్ కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

47 మంది ప్రత్యేక అవసరాల పిల్లల గుర్తింపు

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి ఒకటో జోన్, మండల పరిధిలో మే 1 నుంచి 31వ తేదీ వరకు 47 మంది ప్రత్యేక అవసరాల పిల్లలను గుర్తించినట్లు ఎంఇఒ ఎం.శివరాణి తెలిపారు. కె.నగరపాలెం, పెద ఉప్పాడ గ్రామాల్లో శుక్రవారం సమగ్ర శిక్ష జిల్లా కో-ఆర్డినేటర్ గీత, ఇతర సిబ్బందితో కలిసి పర్యటించారు. నలుగురు ప్రత్యేక అవసరాల పిల్లలను గుర్తించామని తెలిపారు. దగ్గర్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో పేర్లు నమోదు చేసుకుని, భవిత కేంద్రానికి పంపించాలని పిల్లల తల్లి దండ్రులను కోరారు. ఈ కార్యక్రమంలో ఐఇఆర్‌టిలు కెజియా కుమారి, పి.పార్వతి పాల్గొన్నారు.

ట్రాఫిక్ స్ట్రెచ్ మేనేజ్‌మెంట్ అవుట్ పోలీస్ స్టేషన్ ప్రారంభంలో నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్

జీరో రోడ్డు ప్రమాదాలే లక్ష్యం

నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్

ప్రజాశక్తి -గాజువాక : విశాఖ నగరంలో జీరో రోడ్డు ప్రమాదాలు సాధించడమే లక్ష్యమని నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్ తెలిపారు. రోడ్డు ప్రమాదాలు నివారించాలని ఉద్దేశంతో గాజువాకలో ట్రాఫిక్ స్ట్రెచ్ మేనేజ్‌మెంట్ అవుట్ పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చాంబర్ ఆఫ్ కామర్స్ జిల్లా చాప్టర్ సహకారంతో 15 మంది వాలంటీర్లను నియమించామని తెలిపారు. వీరికి 45 రోజుల పాటు, ట్రైనింగ్ ఇచ్చి ద్విచక్ర వాహనాలను కూడా అందజేశామని చెప్పారు. శ్రీనగర్ నుంచి షీలా నగర్ వరకు జాతీయ రహదారిలో వాహనాలు నడుపుతున్న వేగం, రాంగ్ డ్రైవింగ్, రాంగ్ రూటు, సిగ్నల్ జంప్, నో పార్కింగ్ తదితరాలను వీరు పరిశీలిస్తారని తెలిపారు. గత కొన్ని నెలలుగా ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్న షీలా నగర్ నుంచి పాత గాజువాక వరకు ప్రమాదకరమైన జోనుగా పరిశీలించి ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర సంయుక్త పోలీస్ కమిషనర్ పకీరప్ప, డిసిపి మేకా సత్తిబాబు, ఎసిపిలు త్రినాధ్, వాసుదేవ్, ఎ.నరసింహమూర్తి, రాజీవ్‌కుమార్, ట్రాఫిక్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కోటేశ్వరరావు, షణ్ముఖరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రగ్బీ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి నాలుగో వార్డు తిమ్మాపురం విజ్ఞాన్ ఇంటర్నేషనల్ స్కూల్ క్రీడా మైదానంలో రెండ్రోజుల పాటు జరుగనున్న రాష్ట్ర స్థాయి రగ్బీ జూనియర్ బాల బాలికల ఛాంపియన్ షిప్ పోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. జివిఎంసి డిప్యూటీమేయర్ జి శ్రీధర్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. గెలుపోటములను ఒకేలా స్వీకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపల్ చైతన్య, ఎపి రగ్బీ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి బి.రామాంజనేయులు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లలిత్ కుమార్, కిషోర్, స్కూల్ ఎ.ఒ. సురేష్, 13 జిల్లాల క్రీడాకారులు, కోచ్ మేనేజర్లు పాల్గొన్నారు.

క్రీడాకారులను పరిచయం చేసుకొని వస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీధర్

లో-వోల్టేజీతో ఇబ్బందులు

కెపాసిటీ చాలని పాత ట్రాన్స్‌ఫార్మర్లు ఇవే...

- రెండేళ్లుగా ఫిర్యాదు చేస్తున్నా పట్టించుకోని అధికారులు
- రామచంద్రనగర్ ప్రజల ఆవేదన

ప్రజాశక్తి -గాజువాక : జివిఎంసి 76వ వార్డు పెదగంట్యాడ సబ్ స్టేషన్ పరిధి రామచంద్రనగర్ ప్రజలు రెండేళ్లుగా లో-వోల్టేజీ సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రామచంద్రనగర్‌లో 500 కుటుంబాలు నివాసముంటున్నాయి. 800 మీటర్ కనెక్షన్లు ఉన్నాయి. ఇక్కడ రెండు ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి. ఆ రెండు ట్రాన్స్‌ఫార్మర్ల కెపాసిటీ చాలకపోవడం వల్ల రాత్రి 9 తర్వాత లో-వోల్టేజీ సమస్య తీవ్రంగా ఉంటోంది. విద్యుత్ సరఫరా సరిగా లేని కారణంగా, ఇంట్లో విలువైన బల్బులు, రిఫ్రిజిరేటర్లు, వాటర్ కూలర్లు కాలిపోతున్నాయి. ఎక్కువగా మే జూన్ జులైలో ఈ సమస్య ఎక్కువగా ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. సంబంధిత అధికారులకు అనేకసార్లు ఫిర్యాదు చేసినా పాత ట్రాన్స్‌ఫార్మర్లను మార్చడంలేదు. విద్యుత్ తరచూపోతుండటం, దోమలు విపరీతంగా ఉండటంతో రాత్రిపూట నిద్ర ఉండటంలేదు. ఈ కాలనీలో ఉండేవారంతా రోజువారీ కూలి చేసుకుని జీవనం సాగించేవారే. రాత్రిపూట నిద్ర పట్టకపోవడంతో ఉదయం కూలిపనులకు వెళ్లలేక ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.

రాత్రులు నిద్ర ఉండడం లేదు

రాత్రి సమయంలో కరెంట్ అప్ అండ్ డౌన్ అవడం వల్ల ఫ్యాన్లు పనిచేయక నిద్ర పట్టడం లేదు. ప్రతిరోజూ రాత్రి తొమ్మిది తర్వాత విద్యుత్ సరఫరాలో హెచ్చుతగ్గులు చోటుచేసుకుంటున్నాయి. దీంతో విలువైన రిఫ్రిజిరేటర్లు పాడవుతున్నాయి. చాలాసార్లు ఫ్యాన్లు కాలిపోయాయి.

డి.జనార్ధనరావు

ఫిర్యాదు చేసినా స్పందన లేదు

రెండేళ్లుగా స్థానిక ఎలక్ట్రికల్ ఎఇకి ఫిర్యాదు చేస్తూ వచ్చాం. ఆయన స్పందించడం లేదు. స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం ఉన్న పాత రెండు ట్రాన్స్‌ఫార్మర్లు మార్చు చేస్తే తప్ప శాశ్వత పరిష్కారం దొరకదు. తాత్కాలిక మరమ్మత్తుల వల్ల ప్రయోజనం లేదు. దీనిపై ఆందోళన చేస్తాం

డి.రమణ
సిఐటియు నాయకులు

ఎస్టిమేషన్ పంపించాం

లో-వోల్టేజీ సమస్యపై ఎస్టిమేషన్ వేసి ఉన్నతాధికారులకు పంపించాం. కొత్త ట్రాన్స్‌ఫార్మర్ త్వరలో ఏర్పాటు చేస్తాం.

అసిస్టెంట్ ఇంజినీర్
పెదగంట్యాడ సబ్‌స్టేషన్

తులసి ఆశయ సాధనకు కృషి

ప్రజాశక్తి -ములగాడ : అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) విశాఖ జిల్లా అధ్యక్షులు వై.తులసి ఆశయ సాధనకు కృషిచేయడమే ఆమెకిచ్చే నిజమైన నివాళి అని వక్తలు పేర్కొన్నారు. మల్కాపురం జోన్ పరిధి 40వ వార్డు ఎకెసి.కాలనీ అంగన్‌వాడీ భవనంలో మల్కాపురం ప్రాజెక్ట్ అంగన్వాడీవర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన శుక్రవారం తులసి సంస్మరణసభ నిర్వహించారు. అంగన్‌వాడీ కార్మికులు ఘనంగా నివాళు లర్పించారు. తులసి చిత్రపటానికి సంఘం నాయకులు కె.ఈశ్వరమ్మ పూలమాలవేశారు. సిఐటియు మల్కాపురం జోన్ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మణమూర్తి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. తులసి 42 రోజుల పాటు అంగన్‌వాడీ కార్మికుల సమస్యలపై పోరాడారన్నారు. సమస్య పరిష్కారమయ్యే వరకు అందర్నీ ఐక్యంచేసి ముందుండి పోరాటాన్ని నడిపారని తెలిపారు. పట్టుదల, నిజాయితీగా యూనియన్‌ను నడిపే ఘనత ఆమెకే దక్కిందన్నారు. ఆమె పోరాన్మరణం యూనియన్‌కేకాదు విశాఖ కార్మిక ప్రజా ఉద్యమానికి తీరనిలోటు అన్నారు.

తులసి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అంగన్‌వాడీలు

ఐద్వా రాష్ట్ర కమిటీ నాయకులు ఆర్.విమల నివాళు లర్పిస్తూ తులసిలాంటి కార్యకర్తలు ఉండడంవల్ల అంగన్వాడీ కార్మికుల సమస్యలు పరిష్కరించుకోగలిగారని తెలిపారు. తులసి ఆశయాల సాధనలో నడిచినప్పుడే ఆమెకు మనమిచ్చే అసలైన నివాళి అని పేర్కొన్నారు. కె.ఈశ్వరమ్మ అధ్యక్షత వహించిన సంతాప సభలో సంఘం సభ్యులు భారతి, ఈశ్వరి, దాక్షాయిని, పైడికొండ, వై.ఇందిర పాల్గొన్నారు.

నిబంధనలు మీరితే చర్యలు

ప్రజాశక్తి-పెందుర్తి: ఓట్ల లెక్కింపు నేపథ్యంలో ఎన్నికల కమిషనర్ నిబంధనలు మీరితే కఠిన చర్యలు తప్పవని సిఐ రామకృష్ణ హెచ్చరించారు. జివిఎంసి 97వ వార్డులోని ప్రయివేటు కళ్యాణ మండపంలో పలు పార్టీల నాయకులు, కార్యకర్తలకు సిఐ రామకృష్ణ ఆధ్వర్యాన అవగాహన సదస్సు శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పెందుర్తి నియోజకవర్గం ఎన్నికల స్పెషల్ ఆఫీసర్ ఎడిసిపి శ్రీనివాస్ హాజరై మాట్లాడారు. కౌంటింగ్ అనంతరం నియోజకవర్గంలో ఉన్న గ్రామాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకూడదన్నారు. ఇప్పటికే పలు నియోజకవర్గాల్లో రౌడీ షీటర్లపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. కౌంటింగ్ రెండు రోజుల వరకు 144 సెక్షన్ ఉంటుందని తెలిపారు. స్థానికంగా కొట్లాటలకు దిగకూడదని సూచించారు.

గుర్తింపు లేని పాఠశాలల వివరాలు వెల్లడించాలి

ప్రజాశక్తి-సీతమ్మధార : విశాఖ జిల్లాలో గుర్తింపులేని అన్ని యాజమాన్యాల పాఠశాలల వివరాలను ఈ ఏడాది విద్యా సంవత్సరం ప్రారంభంకాక మునుపు బహిర్గతం చేయాలని అన్ని జిల్లాల విద్యాశాఖాధికారులకు ఆదేశాలు జారీచేసినట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం తెలిపారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదలచేశారు. గుర్తింపు లేని పాఠశాలల వివరాలు తెలుసుకోవడం బాలల హక్కు అని పేర్కొన్నారు. గుర్తింపు లేని పాఠశాలల వివరాలు ప్రసార, ప్రచార, పత్రికలు, ఇతర సోషల్ మీడియా ద్వారా అందరూ తెలుసుకునేలా చర్యలు చేపట్టాలని ఆదేశించినట్లు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఆదేశాలు, ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా గుర్తింపు పొందేందుకు తాత్సారం చేసే ఆయా పాఠశాలలపై చట్ట ప్రకారం చర్యలతో పాటు క్రిమినల్ కేసులు పెట్టేందుకు వెనుకడుగు వేయొద్దని సూచించారు. ఇటువంటి పాఠశాలల్లో విద్యార్థులు చేరకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు వహించాలని సూచించారు.

పొగాకు నిర్మూలన దినోత్సవ ర్యాలీ

ధూమపానం నివారణ అవగాహన కార్యక్రమంలో ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి-సీతమ్మధార : జాతీయ పొగాకు నిర్మూలన దినోత్సవం సందర్భంగా విశాఖపట్నం అదనపు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్.పూర్ణేంద్రబాబు జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. ఈ అవగాహన ర్యాలీ జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయం నుంచి సత్యం కూడలి మీదుగా తిరిగి వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయం వరకు సాగింది. ఈ సందర్భంగా పూర్ణేంద్రబాబు మాట్లాడుతూ, పొగాకు ఒక జీవితాన్నే కాకుండా కుటుంబాన్ని చిన్నాభిన్నం చేస్తుందన్నారు. అందుకే భారత ప్రభుత్వం పొగాకును కొన్ని బహిరంగ ప్రదేశాలలో వినియోగించడాన్ని నిషేధించిందని వివరించారు. పొగాకు వినియోగాన్ని తగ్గించుకుంటూ పోవడమే ఈ దినోత్సవం యొక్క ప్రధాన లక్ష్యమన్నారు. సిగరెట్, తంబాకు వినియోగించటం ఫ్యాషన్ కాదని, అది మరణానికి దారి తీస్తుందని తెలిపారు. సిగరెట్, గుట్కా వద్దు జీవితమే ముద్దు, యువత రక్షణపై దృష్టి పెట్టండి అని పిలుపునిచ్చారు.

జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ సమత మాట్లాడుతూ పొగాకు నియంత్రణ కోసం అన్ని విభాగాలూ కలిసి పని చేయాలన్నారు. పొగాకు రహిత భారత దేశ నిర్మాణం కోసం కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎస్.జీవనరాణి, డిఐఒ బి.నాగేశ్వరరావు, ప్రోగ్రాం అధికారులు డాక్టర్.నళిని, డాక్టర్.జగదీష్‌ప్రసాద్, డిఎస్ఒ డాక్టర్.బాలాజీ, ధర్మేంద్ర, హెచ్ఇఒ మోహన్, ఎన్‌సిడి మేనేజర్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ కేన్సర్ ఆసుపత్రిలో...

ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని సీతమ్మధార లయన్స్ కేన్సర్ ఆసుపత్రిలో ధూమపానం నివారణపై అవగాహన, రాజుల కాలం నుంచి ఇప్పటివరకు వినియోగించే వివిధ రకాల సిగరెట్ యాష్ట్రేస్‌లపై ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా లయన్స్ కేన్సర్ ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ వి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ, జీవితంలో ఎంత ఎదిగామనేది ముఖ్యం కాదని, ఎంత ఆరోగ్యంగా ఉన్నామన్నది గౌరవమని చెప్పారు. కనకమహాలక్ష్మి కోపరేటివ్ బ్యాంక్ చైర్మన్ కొమ్మారెడ్డి రాంబాబు మాట్లాడుతూ, ధూమపాన నిషేధంపై అవగాహన కల్పించాలనే సదుద్దేశంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో జెఆర్ నగర్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కెఎస్ఆర్.మూర్తి, కనకమహాలక్ష్మి కోఆపరేటివ్ బ్యాంకు ఉద్యోగి జిఎస్.శివప్రకాష్, బ్యాంకు డైరెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఉద్యోగ విరమణ వీడ్కోలు

ప్రజాశక్తి- విలేకర్ల యంత్రాంగం

జిల్లాలోని పలు శాఖల్లో పని చేస్తూ మే నెల 31న ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగులకు ఆయా శాఖల అధికారులు, సిబ్బంది శుక్రవారం ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఉద్యోగ విరమణ పొందిన వారికి ఘన సత్కారాలు చేశారు.

ఆర్టీసీ డిపో మేనేజర్ సుజాతకు ఘన సత్కారం

అనకాపల్లి : ఆర్టీసీ అనకాపల్లి డిపో మేనేజర్ నల్లి సుజాత ఉద్యోగ విరమణ సన్మాన సభ శుక్రవారం ఆర్టీసి డిపోలో జరిగింది. ఈ సందర్భంగా స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్, అద్దె బస్సుల వర్కర్స్ యూనియన్ సభ్యులు ఆమెను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ అనకాపల్లి జిల్లా కార్యదర్శి పిఎస్‌వి పరమేశ్వరరావు మాట్లాడుతూ విశాఖపట్నం ఆర్టీసీ డిస్పెన్సరీలో సుజాత ఫార్మసిస్ట్‌గా 22 సంవత్సరాల క్రితం పనిచేశారని, నాడు ఏవిధంగా అయితే చిరునవ్వుతో ఉద్యోగులను ఆప్యాయతతో పలకరించేవారో, నేడు డిపో మేనేజర్‌గా కూడా అదే విధంగా అంకితభావంతో పని చేశారని కొనియాడారు. కార్యక్రమంలో డిప్యూటీ సిటిఎం (విశాఖపట్నం) అప్పలనాయుడు, పార్వతీపురం డిపో మేనేజర్ దుర్గా, నర్సీపట్నం డిపో మేనేజర్, అనకాపల్లి అసిస్టెంట్ మేనేజర్ రవిచంద్ర, సూపర్వైజర్లు, అసిస్టెంట్ డిపో క్లర్కులు, కండక్టర్లు, డ్రైవర్లు, గ్యారేజ్ సిబ్బంది, ఆఫీస్ స్టాఫ్, సంఘాల ప్రతినిధులు బత్తిన అప్పారావు, ఎస్ఆర్.త్రిమూర్తులు, ఎస్.రమణ, జి.చిరంజీవి, పలకా సత్యనారాయణ, బి.నాగప్పారావు, ఈ.సత్యనారాయణ, డి.రామకృష్ణ, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎడిసి అప్పారావుకు..

అనకాపల్లి : ఆర్టీసీ అనకాపల్లి డిపోలో అసిస్టెంట్ డిపో క్లర్క్‌గా పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేసిన బేతా అప్పారావును స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా గౌరవ అధ్యక్షులు ఏవి బాపు నాయుడు, జిల్లా కార్యదర్శి పిఎస్‌వి.పరమేశ్వరరావు, కోశాధికారి త్రిమూర్తులు, సహాయ కార్యదర్శి జి.చిరంజీవి, జిల్లా ఉపాధ్యక్షులు ఎస్ రమణ, డిపో అధ్యక్షులు బత్తిన అప్పారావు తదితరులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పరమేశ్వరరావు మాట్లాడుతూ అనేక ఆటుపోట్లను అధిగమించి సుమారు 38 సంవత్సరాల పాటు పని చేశారని తెలిపారు.

ఆర్టీసీ డిపో మేనేజర్ సుజాత దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

పోలీస్ అధికారులకు...

అనకాపల్లి : అనకాపల్లి జిల్లా పోలీసు విభాగంలో పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన ఎస్సైలు ఎం.రామకృష్ణ, కె.వెంకట్రావు, ఏఎస్సై బి.అప్పారావులకు శుక్రవారం ఎస్పీ కే మురళీకృష్ణ చేతుల మీదుగా ఆత్మీయ వీడ్కోలు సన్మాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు బి.విజయభాస్కర్, పి.సత్యనారాయణరావు, ఎస్‌బి డీఎస్పీ బి.అప్పారావు, ఏఓ బి.శారద, ఇన్‌స్పెక్టర్లు చంద్రశేఖర్, సతీష్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేసిన డిపిఆర్‌ఓ సాయిబాబా

అనకాపల్లి : అనకాపల్లి జిల్లా డివిజన్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్‌గా దశమంతరావు సాయిబాబా ఎనలేని సేవలు అందించాలని కలెక్టర్ రవి పటాన్ శెట్టి కొనియాడారు. సాయిబాబా ఉద్యోగ విరమణ చేసిన సందర్భంగా కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం సాయిబాబాకి ఉమ్మడి విశాఖ జిల్లా ఎన్జీవో టీం తరపున జిల్లా కలెక్టర్ రవి పటాన్‌శెట్టి చేతులమీదుగా చిరు సత్కారం చేశారు. అనకాపల్లి ప్రెస్ క్లబ్ ప్రతినిధులు సాయిబాబాను దుస్సాలువా, జ్ఞాపకతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వెంకట్, భాను, నటరాజ్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

డిపిఆర్‌ఓ సాయిబాబాను అభినందిస్తున్న కలెక్టర్ రవి

ఉపాధ్యాయ వృత్తికి వన్నె తెచ్చిన అప్పారావు మాస్టారు

కె.కోటపాడు : మండలంలోని చౌడువాడ జెడ్పి హైస్కూల్ ప్రధానోపాధ్యాయునిగా పని చేస్తూ మే 31న ఉద్యోగ విరమణ చేసిన ఈర్లె అప్పారావు ఉపాధ్యాయ వృత్తికి వన్నె తెచ్చారని, ఆయనను ఉపాధ్యాయులు ఆదర్శంగా తీసుకోవాలని మండల విద్యాశాఖ అధికారులు పి.సత్యనారాయణ, డివిడి ప్రసాదు అన్నారు. చౌడువాడ హైస్కూల్‌లో శుక్రవారం జరిగిన సన్మాన కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా విచ్చేసిన ఎంఈఓలు అప్పారావు లక్ష్మి దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అప్పారావు మాస్టారు 44 సంవత్సరాల ఉపాధ్యాయ సర్వీసులో ఎక్కడ కలంకం లేకుండా అందరి మన్ననలు పొందారని తెలిపారు. ఉద్యోగ విరమణ సందర్భంగా పాఠశాలలో ఫర్నిచర్ నిమిత్తం అప్పారావు మాస్టారు రూ.20 వేలు విరాళం అందజేశారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు, తన వద్ద చదువుకున్న విద్యార్థులు, సహసర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఎడిసి అప్పారావును సత్కరిస్తున్న ఎస్‌డబ్ల్యుఎఫ్ నేతలు

ఉద్యోగ విరమణ చేసిన పోలీసులను అభినందిస్తున్న ఎస్‌పి

అప్పారావు మాస్టార్ దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

సూర్యనారాయణను పరామర్శిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి లోకనాథం, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అప్పలరాజు, ప్రజాశక్తి జనరల్ మేనేజర్ వెంకటేశ్వర్‌రావు తదితరులు

సిపిఎం సీనియర్ నాయకులు వనుము సూర్యనారాయణ కుమారుడు మృతి

ప్రజాశక్తి- కె.కోటపాడు

మండలంలోని సూరెడ్డిపాలెం గ్రామానికి చెందిన సిపిఎం సీనియర్ నాయకులు వనుము సూర్యనారాయణ కుమారుడు వనుము దేముడుబాబు గుండెపోటుతో శుక్రవారం మృతి చెందారు. దేవుడుబాబు అంత్యక్రియలు స్వగ్రామం సూరెడ్డిపాలెంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు, ప్రజాశక్తి దినపత్రిక జనరల్ మేనేజర్ ఎం.వెంకటేశ్వరరావు, ప్రజా సంఘాల మండల కన్వీనర్ ఎర్ర దేవుడు, సిఐటియు మండల నాయకులు ఈర్లె నాయుడు బాబు తదితరులు సూరెడ్డిపాలెం గ్రామంలో సూర్యనారాయణ కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సంతాపాన్ని, సానుభూతిని తెలియజేశారు.

ఎపిఈసెట్‌లో పవన్ కుమార్‌కు 5వ ర్యాంకు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట

పవన్ కుమార్

బుచ్చయ్యపేట మండలం పోలేపల్లి గ్రామానికి చెందిన జనపరెడ్డి పవన్ కుమార్ ఏపీఈసెట్‌లో ఐదో ర్యాంకు సాధించాడు. కెమికల్ ఇంజినీరింగ్ విభాగంలో 200కు 146 మార్కులు సాధించాడు. తండ్రి కోటేశ్వరరావు తాపీ మేస్త్రీగా, తల్లి కూలి పనులకు వెళ్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. పవన్ పదో తరగతి వరకు దిబ్బిడి జడ్పీ హైస్కూల్లో చదువుకున్నాడు. కంచరపాలెంలోని గవర్నమెంట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీలో డిప్లమో పూర్తి చేశాడు.

టెన్త్ మెరిట్ విద్యార్థులకు రెడ్డీస్ ఫౌండేషన్ ప్రోత్సాహం

ప్రజాశక్తి -మునగపాక

మండలంలోని తోటాడ జెడ్పీ హైస్కూల్లో ఈ ఏడాది పదో తరగతి ఫలితాల్లో అత్యధిక మార్కులతో ప్రతిభ కనబర్చిన ముగ్గురు విద్యార్థులు డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ప్రోత్సాహకానికి ఎంపికయ్యారు. వీరు రెండేళ్ల పాటు ఇంటర్మీడియట్ విద్యను ఉచితంగా పొందనున్నారు. ఈ మేరకు ఎంపికైన విద్యార్థులు లావేటి హాసిని, ఆడారి వేణుశ్రీ, యల్లపు శ్రావ్యలను హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు బి.కుమార్ శుక్రవారం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముగ్గురు విద్యార్థులు భీమిలి బీచ్ రోడ్డు, తిమ్మాపురం సమీపంలోని విజ్ఞాన్ వరల్డ్ వన్ స్కూల్‌లో సీట్లు పొందారని చెప్పారు. రెడ్డీస్ ఫౌండేషన్ ఒక్కో విద్యార్థికి ఏడాదికి రూ 2.86 లక్షలు ఖర్చు చేస్తుందని తెలిపారు. తమ పాఠశాల నుంచి ముగ్గురు ఎంపిక కావడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు.

విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం కుమార్

సత్ప్రవర్తనతో మెలగాలి

ప్రజాశక్తి- అనకాపల్లి

జైలు నుంచి బయటికెళ్లాక ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలని 11వ అడిషనల్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్, మొదటి అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి రమేష్ సూచించారు. అనకాపల్లి సబ్ జైలును శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఖైదీలకు జైల్లో కల్పిస్తున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. లోపాలుంటే వెల్లడించాలని చెప్పారు. ఎవరికైనా న్యాయ సహాయం కావాలంటే కోర్టు దృష్టికి తీసుకురావాలని సూచించారు. తెలిసి ఎవరు తప్పు చేయకూడదని, దానివలన జైలుకు వస్తే వ్యక్తిగత జీవితంతో పాటు కుటుంబం రోడ్డున పడుతుందని హితవు పలికారు. అనంతరం ఆహారంలో నాణ్యతను, పడక గదులను పరిశీలించారు. సబ్ జైల్ సూపరింటెండెంట్ గణేష్ రెడ్డి, న్యాయ సహాయకులు సాయిరాం, తులసి, రోజా, ఎంఎల్ఎస్‌సి ప్రతినిధి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

తమ సమస్యలు చెబుతున్న ఖైదీలు

కెరీర్ పట్ల అవగాహన పెంచుకోవాలి

ఆర్‌జెడి విజయభాస్కర్

ప్రజాశక్తి-అనకాపల్లి

స్కూలు స్థాయిలోనే విద్యార్థులు తమ భవిష్యత్తు గురించి ఆలోచించాలని, కెరీర్ పట్ల అవగాహన పెంపొందించుకోవాలని విద్యాశాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ (ఆర్‌జెడి) బి.విజయభాస్కర్ అన్నారు. శ్రీగౌరీ గ్రంథాలయంలో 'కెరీర్ గైడెన్స్-భవిష్యత్' అన్న అంశంపై శుక్రవారం జరిగిన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. వ్యవసాయ భూమి సాగు మాదిరిగానే ప్రతి ఒక్కరూ మెదడును కూడా కొత్త ఆలోచనలతో సాగు చేసుకోవాలన్నారు. మరొకరితో పోల్చుకోకుండా ఎవరికి వారు లక్ష్య సాధనకు కృషి చేయాలని సూచించారు. ఉద్యోగం కోసమైనా, ఉన్నత చదువుకైనా సార్లు రివిజన్ చాలా ముఖ్యమని, ఎక్కువ సార్లు రివిజన్ చేస్తే మెదడులో అలా నిక్షిప్తమై ఉంటుందని తెలిపారు. మార్కుల వేటలో పగలూ రాత్రీ తేడా లేకుండా సాధన చేయించే విధానాలకు స్వస్తి పలికి ఆటలు, నిద్ర, ఇతర అంశాలకూ చోటుండేలా ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. సబ్జెక్టు జ్ఞానం ఎంత అవసరమో ప్రాక్టికల్ పరిజ్ఞానం, ఏ విషయాన్ని అయినా సమర్థంగా ఎదుర్కొగల ఎమోషనల్ ఇంటెలిజెన్స్ కూడా అంతే ముఖ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ కార్యదర్శి కాండ్రేగుల వెంకటరమణ, అధ్యక్షుడు డి.నూకఅప్పారావు, మాజీ కార్యదర్శి మళ్ల బాపునాయుడు, లెక్చరర్ విల్లూరి అప్పల సత్యనారాయణ, కంప్యూటర్ శిక్షకులు శరగడం కిశోర్ బాబు, కె.గౌరీశ్వరి, జి.నాగమణి, పి.ఇందిర, విద్యార్థులు, నిరుద్యోగులు, యువత, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ముగిసిన కంప్యూటర్ శిక్షణా తరగతులు

గౌరీ గ్రంథాలయంలో నెల రోజులుపాటు జరిగిన కంప్యూటర్ శిక్షణా తరగతులు శుక్రవారంతో ముగిసాయి. కంప్యూటర్ శిక్షణ పొందిన విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులను, శిక్షణలో పాల్గొన్న విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలను ఆర్‌జెడి విజయభాస్కర్ అందజేశారు.

కంప్యూటర్ శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు అందించిన నిర్వాహకులు

ఉద్యోగాలు పొందిన విద్యార్థులను సత్కరిస్తున్న దృశ్యం

డైట్‌లో జాబ్ ఎచీవర్స్ డే వేడుక

ప్రజాశక్తి -అనకాపల్లి

స్థానిక డైట్ అటానమస్ కళాశాలలో డిప్లొమా విద్యార్థులకు జాబ్ ఎచీవర్స్ డే వేడుక శుక్రవారం జరిగింది. ఈ వేడుకలో ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను, వారి తల్లితండ్రులను సాలువతో ఘనంగా సత్కరించి మొమెంటో అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ మాట్లాడుతూ డైట్‌తో చాలా కోర్ కంపెనీలు, సాఫ్ట్వేర్ కంపెనీలు ఎంవోయు చేసుకున్నాయని, తద్వారా విద్యార్థులకు మరిన్ని ఎక్కువ నియామకాలు జరగనున్నాయని తెలిపారు. డైట్ ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్.వైకుంఠరావు మాట్లాడుతూ మరిన్ని మల్టీనేషనల్ కంపనీలలో విద్యార్థులు చురుకుగా పాల్గొనాలన్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ కె దుర్గా శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ డైట్‌లో ప్రాంగణ నియామకాలకు పెద్ద పీట వేశారని, దీనిని అందరూ ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీన్స్ డాక్టర్ కె.పార్వతి, డాక్టర్ కె.ఈశ్వరరావు, ఎకడమిక్ కోఆర్డినేటర్ ఎ.కృష్ణనాగ్, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ హేమంత్ కుమార్, డిప్లొమా కోఆర్డినేటర్ ఎన్ సరితా రాణి, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

పాలిసెట్ కౌన్సెలింగ్‌కు 130 మంది హాజరు

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి మండలం రేబాక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన పాలీసెట్ కౌన్సిలింగ్‌కు 130 మంది విద్యార్థులు హాజరయ్యారు. 75 మంది బాలురు, 55 మంది బాలికలు హాజరుకాగా వారి ధ్రువపత్రాలు పరిశీలించి ఐసిఆర్ పత్రాలను అందజేశారు. కాగా శనివారం 75 వేల ఒకటవ ర్యాంకు నుంచి 92 వేల ర్యాంకు వరకు కౌన్సిలింగ్ జరుగుతుందని, ఉదయం 9 గంటలకే ధ్రువ పత్రాలతో విద్యార్థులు హాజరు కావాలని కళాశాల ప్రిన్సిపల్ ఐవి ఎస్ఎస్ శ్రీనివాసరావు తెలిపారు.

వికలాంగ విద్యార్థుల గుర్తింపు సర్వే పర్యవేక్షణ

ప్రజాశక్తి-అనకాపల్లి

ఏపీ సమగ్ర శిక్ష పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక ఉపాధ్యాయులు నిర్వహిస్తున్న వికలాంగ విద్యార్థుల గుర్తింపు సర్వేను అనకాపల్లి జిల్లా సమగ్ర శిక్ష సాహితి విద్య జిల్లా కోఆర్డినేటర్ శకుంతల శుక్రవారం అనకాపల్లి గవరపాలెంలోని నెయ్యిల వీధిలో పర్యవేక్షించారు. ఈ సందర్భంగా శకుంతల మాట్లాడుతూ ప్రత్యేక ఉపాధ్యాయుల ద్వారా మే 1 తేదీ నుండి జూన్ 9వ తేదీ వరకు ప్రత్యేక అవసరాల పిల్లల గుర్తింపు సర్వే నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. ఈ మండలంలో సర్వే చురుగ్గా సాగుతుందన్నారు. ఇప్పటి వరకు జిల్లాలో కొత్తగా 327 మందిని గుర్తించినట్లు చెప్పారు. అనకాపల్లి మండలంలో ఇప్పటివరకు 35 మంది వికలాంగ విద్యార్థులను గుర్తించామన్నారు. ప్రాథమిక స్థాయిలోనే వికలాంగ విద్యార్థులను గుర్తించడం వలన వారికి అవసరమైన సేవలను, సదుపాయాలు కల్పించడం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఉపాధ్యాయులు రమాదేవి, యేసు రత్నం పాల్గొన్నారు.

సర్వే పర్యవేక్షిస్తున్న జిల్లా కోఆర్డినేటర్ శకుంతల

కబళించిన మృత్యువు

- లారీ కింద నిద్రిస్తున్న క్లీనర్లను తొక్కేసిన అదే వాహనం
- ఒకరు దుర్మరణం
- మరొకరి పరిస్థితి ఆందోళన
- బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలి : సిఐటియు

ప్రజాశక్తి - పరవాడ

మండలంలోని ఎన్‌టిపిసి సింహాద్రి యాష్ పాండు వద్ద గురువారం అర్ధరాత్రి లారీ కింద నిద్రిస్తున్న ఇద్దరు కార్మికులను అదే లారీ తొక్కేయడంతో ఒకరు మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడి ప్రాణాప్రాయస్థితిలో ఉన్నాడు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం...

వినయ్‌కుమార్ (ఫైల్‌ఫొటో)

ఎన్‌టిపిసి సింహాద్రి యాష్ పాండు వద్ద గురువారం అర్ధరాత్రి టిప్పరు లారీలో ఫ్లైయాష్ లోడింగ్ జరుగుతుంది. క్లీనర్లుగా పని చేస్తున్న నర్సీపట్నం మండలం వేములపూడి గ్రామానికి చెందిన వినయ్ కుమార్ (30), మాకవరపాలెం మండలం గిడుతూరు గ్రామానికి చెందిన ఎం.దిలీప్ కుమార్ (20) ఇద్దరూ లోడింగ్ పూర్తయ్యే వరకు ఒక కునుకు తీయొచ్చని అదే లారీ కింద పడుకున్నారు. ఇద్దరూ మత్తు నిద్రలో ఉన్నారు. లోడింగ్ అనంతరం డ్రైవర్ నిద్రిస్తున్న క్లీనర్లను గుర్తించకుండా లారీని స్టార్ట్ చేసి ముందుకు పోనిచ్చాడు. దీంతో లారీ కింద నిద్రిస్తున్న ఇద్దరి పైనుండి లారీ తొక్కుకొని వెళ్లడంతో వినయ్‌కుమార్ అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. దిలీప్ కుమార్ తీవ్రంగా పడడంతో ఆయన్ను అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. ఆయన పరిస్థితి విషమంగా ఉండడంతో శుక్రవారం విశాఖ కెజిహెచ్‌కు తరలించారు. సమాచారం అందుకున్న పరవాడ సిఐ బాల సూర్యరావు తమ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని వినయ్‌కుమార్ మృతదేహాన్ని అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రికి తరలించారు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.

బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలి : సిఐటియు

లారీ తొక్కేసిన ప్రమాదంలో మృతి చెందిన వినయ్‌కుమార్ కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలని, తీవ్రంగా గాయపడిన దిలీప్ కుమార్‌కు మెరుగైన వైద్యం అందించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. ప్రధాన యజమాని అయిన ఎన్‌టిపిసి యాజమాన్యం జోక్యం చేసుకొని కార్మికులు కుటుంబాలకు న్యాయం చేయాలని కోరారు.

భద్రతను పట్టించుకోకపోవడం వల్లే

ఎన్‌టిపిసి బూడిద లోడింగ్ ప్రాంతంలో లైటింగ్ పూర్తిస్థాయిలో లేకపోవడం, సెక్యూరిటీ సిబ్బందిని నియమించకుండా యాజమాన్యం భద్రతని గాలికొదిలేయడం వల్లే ఈ ప్రమాదం చోటుచేసుకుందని గనిశెట్టి పేర్కొన్నారు. ఈ ప్రమాదంపై సమగ్ర విచారణ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే అధిక బూడిద లోడుతో లారీలు వెళుతున్నా యాజమాన్యం పట్టించుకోవడంతో ప్రజల ఆరోగ్యాలు పాడవుతున్నాయని, ప్రమాదాలకు కారణమవుతున్నాయని, పోలీసు, ఆర్టీవో అధికారులు పర్యవేక్షణ చర్యలు తీసుకోవాలని గనిశెట్టి కోరారు.

3న పర్సా సత్యనారాయణ శతజయంతి సభ

ప్రజాశక్తి- అనకాపల్లి : సిఐటియు వ్యవస్థాపక అధ్యక్షులు, కార్మిక నాయకులు కామ్రేడ్ పర్సా సత్యనారాయణ శతజయంతి సభ జూన్ 3వ తేదీన అనకాపల్లి సిఐటియు కార్యాలయంలో జరుగుతుందని ఈ సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఆర్.శంకరరావు, జి కోటేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సభకు సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నరసింగరావు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. కామ్రేడ్ పర్సా సత్యనారాయణ సాధారణ కార్మికుని స్థాయి నుండి సింగరేణి బొగ్గు గనులలో కార్మిక సంఘాల్ని ఏర్పాటు చేసి కార్మికుల హక్కుల కోసం పోరాడారని గుర్తు చేశారు. నాటి ప్రభుత్వం, నైజాం రాజుల నిర్బంధాలను ఎదుర్కొన్నారని, కార్మిక నేతగా, శాసన సభ్యులుగా ప్రజా సమస్యలపై పోరాడారని పేర్కొన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సీఐటీయూని అగ్రగామిగా నిలబెట్టారని, చివరివరకు తాను నమ్మిన సిద్ధాంతం కోసం, కార్మిక హక్కుల కోసం కృషి చేశారని, అటువంటి కార్మిక నేత శతజయంతి సభలో కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

పెదముషిడివాడలో అవగాహన సదస్సు

ప్రజాశక్తి-పరవాడ : మండలంలోని పెదముషిడివాడ గ్రామంలో గురువారం రాత్రి పరవాడ డిఎస్పి కెవి సత్యనారాయణ ఆధ్వర్యంలో గ్రామస్తులకు అవగాహన సదస్సు నిర్వహించారు. జూన్ 4న సార్వత్రిక ఎన్నికలు కౌంటింగ్ సందర్భంగా గ్రామాలలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు ఏ విధమైన నియమ నిబంధనలు పాటించాలో గ్రామస్తులకు, యువతకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పరవాడ సిఐ బాల సూర్యరావు, ఎస్సైలు మల్లేశ్వరరావు, సురేష్ ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సజ్జలను అరెస్టు చేయాలని పోలీసులకు ఫిర్యాదు

ప్రజాశక్తి-అనకాపల్లి

జూన్ 4వ తేదీన జరుగు కౌంటింగ్ హాల్లో నిబంధనలను పాటించవసరం లేదని, ఎట్టి పరిస్థితుల్లో కూటమి గెలవకూడదని ప్రభుత్వ సలహాదారుడు సజ్జల రామకృష్ణారెడ్డి వైసిపి శ్రేణులను రెచ్చగొడుతున్నారని, శాంతి భద్రతలకు విఘాతం కల్పించేలా ప్రకటన చేసిన ఆయన్ను తక్షణమే అరెస్టు చేయాలని మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు అనకాపల్లి పట్టణ పోలీస్ స్టేషన్లో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శంకర్రావుకు శుక్రవారం ఫిర్యాదు సమర్పించారు. ఎన్నికల జరిగి పది రోజులు వరకూ మాట్లాడని సజ్జల తెర మీదకు వచ్చి రాష్ట్రమంతా అల్లకల్లోలం చేయాలని వైసీపీ సమావేశంలో ఆ పార్టీ వైసీపీ శ్రేణులను రెచ్చగొట్టారని తెలిపారు. తక్షణమే సజ్జల రామకృష్ణారెడ్డిని అదుపులోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మల్ల గణేష్, బొడ్డేడ మురళి, బుద్ధ కాశి బుద్ధ భువనేశ్వర్రావు, విల్లూరి రమణబాబు తదితరులు పాల్గొన్నారు.

లూజు ఇంధనం దొరక్క ఇబ్బందులు

-సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఆంక్షలు
-ఇక్కట్లు పడుతున్న ట్రాక్టరు రైతులు, వాహనదారులు

ప్రజాశక్తి - యలమంచిలి : సార్వత్రిక ఎన్నికలు సందర్భంగా రాష్ట్రంలో చోటుచేసుకున్న హింసాత్మక ఘటనల నేపథ్యంలో పెట్రోల్ బంకుల్లో లూజు ఇంధనం అమ్మకాన్ని నిషేధించడంతో వాహనదారులు, ట్రాక్టర్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రంలోని అనేక చోట్ల దాడులు జరిగాయి. హింసాకాండ చెలరేగింది. ఇవిఎంలు పగిలాయి. దాడుల నేపథ్యంలో పెట్రో బాంబులు కూడా పేలాయి. చాలా చోట్ల ఆస్తి నష్టం జరిగింది. ఈ పరిణామాల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ సూచన మేరకు రాష్ట్రంలోని బంకుల్లో పెట్రోలు, డీజిల్ లూజు అమ్మకాలు జరగకూడదని ఆంక్షలు విధించింది. పెట్రోలు బంకు యజమానులందరికీ లూజు ఇంధనం అమ్మకం నిషేధించడం జరిగిందని, నిబంధనలు ఉల్లంఘిస్తే శిక్షార్హులని తాఖీదులివ్వడంతో యలమంచిలి పరిసరాల్లోని 5 బంకుల్లో లూజు ఇంధనం అమ్మకం ఆగిపోయింది.

దీంతో దారిలో పెట్రోలు లేక ఆగిపోయిన ద్విచక్ర వాహనదారులు ప్రయాసతో బాటిళ్లు పట్టుకొని బంకులకు వచ్చి హెచ్చరిక బోర్డులు చూసి ఉసూరుమంటున్నారు. ఒక పక్క మండుటెండల్లో ప్రయాణించే బైక్‌వాలాలు మధ్యలో ఆగిపోయిన వాహనాలతో సతమతమౌతున్నారు. మెకానిక్ షాపుల వద్ద లూజు పెట్రోలు అమ్మకం పూర్తిగా ఆగిపోయింది. లూజు పెట్రోలు దొరికడం ఆసాధ్యంగా మారిపోయింది. దీంతో అదే దారిలో వెళ్లే వాహనదారులను బతిమాలి పైపుల ద్వారా ఏ కాస్తో పెట్రోలు తీసుకొని తరువాత బంకులకు వెళ్లి పూర్తి స్థాయిలో పెట్రోలు కొట్టించుకుంటున్నారు.

యలమంచిలి పెట్రోల్ బంకు



ఇంధనం లూజుగా అమ్మవద్దని పోలీసులు పెట్టిన హెచ్చరిక బోర్డు

ఇబ్బందులు పడుతున్న రైతులు

ఈ ఏడాది మే నెలలోనే వర్షాలు కురిశాయి. నైరుతి రుతుపవనాలు ముందస్తుగానే దేశంలోకి ప్రవేశిస్తున్నాయన్న వార్తలతో రైతాంగం వేసవి దుక్కులు, అకుమడులు తయారీలో తల మునకలై ఉన్నారు. అందుకు అందుబాటులోని ట్రాక్టర్లను పెట్టి భూములు దున్నించుకుంటున్నారు. ట్రాక్టర్లకు అవసరమైన డీజిల్ కేనుల్లో రైతులే రప్పించి ఇవ్వాల్సి ఉంటుంది. అయితే ఎక్కడా లూజు డీజలు దొరక్క రైతులు తలలు పట్టుకుంటున్నారు. డీజిల్ అయిపోయిన ట్రాక్టరును బంకు వరకు తీసుకురావడం ఇబ్బందికరంగా మారింది. డీజిలున్న మరో ట్రాక్టరును బంకుకు పంపించి దాని ట్యాంకు నిండా డీజిల్ కొట్టించి పొలంలోకి వచ్చిన తర్వాత ట్యాంకులోని డీజిల్‌ను పైపు ద్వారా మరో కేన్‌లోకి తోడి ఆ తర్వాత రెండో ట్రాక్టరులోకి నింపుతున్నారు. ఇలా చేయడం వలన ఖర్చు చాలా పెరిగిపోతోందని రైతులు వాపోతున్నారు. మరో నాలుగు రోజుల్లో ఎన్నికల తతంగం ముగియనుంది. ఆ వెంటనే బాటిళ్లు, క్యాన్‌ల ద్వారా లూజు ఇంధనం అమ్మకం పునరుద్ధరించాలని వాహనదారులు, రైతులు కోరుతున్నారు.

మండుతున్న కూరగాయల ధరలు

-వారం రోజుల్లో పైపైకి- ఎండలకు తగ్గిన దిగుబడి- గగ్గోలు పెడుతున్న సామాన్య, మధ్యతరగతి ప్రజలు

మండుతున్న ఎండలతో కూరగా యల దిగుబడి తగ్గడంతో కూరగాయ ధరలకు రెక్కలొచ్చాయి. దీంతో, సామాన్య, మధ్యతరగతి ప్రజలు కొనే స్థితి లేక గగ్గోలు పెడుతున్నారు. వారం రోజుల్లో కూరగాయల ధరలు అమాంతంగా పెరిగాయి. ప్రతి కూరగాయ పైన కిలో రూ.10 నుండి 20 వరకు ధరలు పైపైకి చేరాయి.

ప్రజాశక్తి -నక్కపల్లి:క్యారెట్ కిలో గత వారం రూ.40 లు ఉండగా ప్రస్తుతం మార్కెట్‌లో కిలో రూ.60 ధర ఉంది. బీట్‌రూట్ కిలో రూ.60లు, బెండ కిలో రూ.60, బీర కిలో రూ.60, బంగాళాదుంపలు కిలో రూ.40, టమోటా కిలో రూ.40, దొండ కిలో రూ. 40 , వంకాయలు కిలో రూ.50 లు,మిర్చి కిలో రూ.80, అల్లం కిలో రూ.200, ఉల్లి కిలో ఒక రకం రూ.25, మరో రకం పెద్దవి రూ.30, క్యాబేజీ కిలో రూ.40 ధరలు ఉన్నాయి. గతవారం కంటే క్యారెట్ టమోటా, అల్లం, మిర్చి ధరలు మరింతగా పైపైకి చేరాయి. బెండ, బీరకాయ ధరలు అధికంగా ఉండటంతో వాటిని కొనుగోలు చేసుకు నేందుకు వినియోగదారులు ముందుకు రా లేదు. మార్కెట్‌లో ఏ కూరగాయ కొనాలన్నా కిలో రూ. 40 లు నుంచి కిలో రూ.60 పై మాటే. ధరలు ఒక్కసారిగా ఆకాశాన్నంటడంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు కూరగాయలు కొనేందుకు భయపడుతున్నారు. కూరగాయల ధరలు పైపైకి చేరడంతో సామాన్య, మధ్య తరగతి ప్రజలు అర, పావు కేజీ చొప్పున కూరగా యలు కొనుగోలు చేసుకుంటున్నారు. వేసవి కావడంతో కూరగాయల దిగుబడి బాగా తగ్గిందని, దీంతో గత వారం కంటే అన్ని కూరగాయల ధరలు పెరిగాయని వ్యాపారులు చెబుతున్నారు. వర్షాలు పడి కూరగాయలు సమృద్ధిగా చేతికందినప్పుడే ధరలు తగ్గే అవకాశం ఉంది. అప్పటివరకు ధరల మంట తగ్గేటట్లు లేదు. ఇది తలచి ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు.

వెలవెల బోతున్న కూరగాయాల దుకాణం

హర్షిత

ఎపి అగ్రిసెట్ ఇంజినీరింగ్‌లో
ప్రథమ ర్యాంక్ సాధించిన హర్షిత

ప్రజాశక్తి -చీడికాడ:ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహించిన ఏపీ అగ్రిసెట్ ఇంజనీరింగ్ విభాగంలో రాష్ట్రంలో ప్రథమ ర్యాంక్ సాధించి హర్షిత సత్తా చాటింది. చీడికాడ మండలంలో సిరిజం పంచాయితీ లక్ష్మీనారాయణపురం గ్రామానికి చెందిన మతల శ్రీను, దేవి దంపతుల కుమార్తె మతల హర్షిత ఏపీ అగ్రిసెట్ ఇంజనీరింగ్ విభాగంలో 200 మార్కులు గాను 129 మార్కులు సాధించి రాష్ట్రంలో మొదటి ర్యాంకు సాధించింది.హర్షిత ఒకటి వ తరగతి నుండి 10వ తరగతి వరకు తన సొంత గ్రామం లక్ష్మీనారాయణ పురం, చీడికాడ మండల కేంద్రంలో ప్రభుత్వ హైస్కూల్లో విద్యను అభ్యసించింది. అనకాపల్లి వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లమో చదివింది ప్రథమ ర్యాంకు సాధించడంపై హర్షితను తల్లిదండ్రులు, గ్రామస్తులు అభినందించారు. హర్షిత మాట్లాడుతూ వ్యవసాయ కేంద్రంలో శాస్త్రవేత్తగా రాణించి సేవలు అందించాలని తన కోరిక అని తెలిపింది.

మాట్లాడుతున్న జిల్లా కోఆర్డినేటర్, ఎంఇఒ

మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం

ప్రజాశక్తి -నక్కపల్లి:మెనూ ప్రకారం విద్యార్థులకు సుచి, రుచికరమైన భోజనం అందించాలని మధ్యాహ్నం భోజనం పథకం జిల్లా కోఆర్డినేటర్ కె.శ్రీనివాసరావు, ఎంఈఓ కే నరేష్ సూచించారు. మండలంలోని వేంపాడు హైస్కూల్‌లో శు క్రవారం మధ్యాహ్నం భోజనం పథకం నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. నూతన విద్యా సంవత్సరంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు విద్యార్థులకు పోషకాహారం అందించాలన్నారు. మెనూ అమలు చేయడంలో రాజీ పడకూడదని సూచించారు. పరిశుభ్రమైన వాతావరణంలో, పరిశుభ్రంగా భోజనం తయారు చేసి వేడివేడిగా విద్యార్థులకు అందించాలన్నారు. ఇళ్ల దగ్గర కంటే స్కూల్‌లోనే భోజనం రుచికరంగా ఉందన్న భావన విద్యార్థుల్లో కలగజేసే ఆహారాన్ని అందించాలన్నారు. నిర్వాహకులు వంట సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు, పాటించాల్సిన విధి, విధానాలు, పరిసరాలు శుభ్రతపై రిసోర్స్ పర్సన్ వివరించారు. ఈ సమావేశంలో నోడల్ ప్రధానోపాధ్యాయుడు వేమగిరి నూకరాజు, వేంపాడు హైస్కూలు ప్రధానోపాధ్యాయుడు ఎమ్.మూర్తిరాజు, మధ్యాహ్న భోజన నిర్వాహకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపిడిఒ

ప్రజలకు అందుబాటులో ఉండాలి

ప్రజాశక్తి-కోటవురట్ల:మండలంలోని పందూరు, కైలాసపట్నం సచివాలయాలను శుక్రవారం ఎంపీడీవో కాశీ విశ్వనాథరావు సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బందితో ఆయన మాట్లాడుతూ, ప్రజలకు అందుబాటులో ఉండాలని గ్రామాలను సందర్శించి మౌలిక వసతుల కల్పనకు కృషి చేయాలని తెలిపారు. ప్రధానంగా తాగునీరు, పారిశుద్ధ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. సిబ్బంది సమయపాలన పాటించడంతో పాటు, దరఖాస్తుదారులకు ధ్రువపత్రాలు సకాలంలో అందజేయాలన్నారు. సకాలంలో గ్రామసభలు నిర్వహించడంతో పాటు బోర్డు సమావేశాలు జరపాలన్నారు.

చిన్నారులకు క్రీడా పోటీలు

ప్రజాశక్తి -నక్కపల్లి:నక్కపల్లి శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా గ్రంథాలయ అధికారి గోవిందేశ్వరరావు ఆధ్వర్యంలో శుక్రవారం చిన్నారులకు లెమన్ అండ్ స్పూన్ క్రీడా పోటీలను నిర్వహించారు. విద్యార్థులు ఎంతో ఉత్సాహంతో ఈ పోటీల్లో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు దవరసింగి సన్యాసిరావు (బాబ్జీ), కె.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అప్పారావును ఆదర్శంగా తీసుకోవాలి

ప్రజాశక్తి-సీతమ్మధార : వైద్య ఆరోగ్య శాఖలో సుదీర్ఘకాలం పాటు అంకితభావంతో ప్రజలకు సేవలందించిన పి.రామకోటి అప్పారావును సహచర ఉద్యోగులంతా ఆదర్శంగా తీసుకోవాలని జిల్లా మలేరియా అధికారి తులసి రాజ్ అన్నారు. వైద్య ఆరోగ్య శాఖలో 26 ఏళ్ళ పాటు పనిచేసిన రామకోటి అప్పారావు ఉద్యోగ విరమణ సందర్భంగా ఆత్మీయ వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ నగేష్ పట్నాయక్ ఆధ్వర్యాన శుక్రవారం ఏర్పాటుచేసిన ఆత్మీయ వీడ్కోలు సమావేశంలో తులసీరాజ్ మాట్లాడుతూ, వైద్య ఆరోగ్య శాఖలో వివిధ విభాగాలలో పనిచేసిన రామకోటి ఉన్నతాధికారుల మన్ననలతో పాటు, మంచి పేరు సంపాదించారన్నారు. చిన్న స్థాయి నుంచి సూపర్‌వైజర్ స్థాయి వరకు ఎదిగారని తెలిపారు. కరోనా మహమ్మారి కాలంలో ఆయన అందించిన సేవలు మరువలేనివన్నారు. రామకోటి అప్పారావు. లక్ష్మి దంపతులను సత్కరించి సన్మాన పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్ఇఒలు శ్రీనివాసాచారి, శేషుబాబు, నాగశ్రీను, వెంకటేష్, యూనియన్ నాయకులు రమణ, ఎస్సీ రమణ, సూపర్ వైజర్లు, హెల్త్ అసిస్టెంట్లు, ల్యాబ్ టెక్నీషియన్లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో కార్డన్ సెర్చ్

ప్రజాశక్తి -పరవాడ

మండలంలోని గొర్లివానిపాలెం గ్రామపంచాయతీ పరిధి, పరవాడ పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న బసవతారక రామ్ నగర్, జన్యురం కాలనీలో పరవాడ సిఐ బాల సూర్యారావు ఆధ్వర్యంలో శుక్రవారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా రికార్డులు లేని 28 ద్విచక్ర వాహనాలను పట్టుకుని సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు.

కోటవురట్ల:ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తుగా మండలంలో పోలీసుల శుక్రవారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఎలమంచిలి, పాయకరావుపేట, నర్సీపట్నం పోలీసులతో కలిసి స్థానిక ఎస్సై రమణయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్డన్ సెర్చ్‌లో 150 వాహనాలను పరిశీలించి 80వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. రికార్డులు సక్రమంగా లేని 24 ద్విచక్ర వాహనాలను, ఒక ఆటోను సీజ్ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ, ఈనెల 4న జరగనున్న ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రజలంతా సహకరించాలని కోరారు. అల్లర్లకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

కోటవురట్లలో స్వాధీనం చేసుకున్న బైకులు

ఎండ వేడిమితో..
వారపు సంత వెలవెల

- పెరిగిన ఉష్ణోగ్రతలకు అల్లాడిన చిరు వ్యాపారులు

ప్రజాశక్తి -నక్కపల్లి:ప్రచండ భానుడి ప్రతాపానికి జనం విలవిల లాడారు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో 38 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయింది. తీవ్రమైన వేడిగాలులకు ఉక్క పోత తోడవడంతో జనం ఉక్కిరి బిక్కిరయ్యారు. నక్కపల్లిలో ప్రతి శు క్రవారం వారపు సంత జరుగుతుంది. కూరగాయలతో పాటు, ఎండు చేపలు మార్కెట్‌లో లభిస్తాయి. నక్కపల్లి తోపాటు చుట్టుపక్కల గ్రామాల నుండి జనం తరలివచ్చి కూరగాయలు, ఎండు చేపలు కొనుగోలు చేసుకుని తీసుకు వెళ్తూ ఉంటారు. శుక్రవారం మార్కెట్ పై సన్ ఎఫెక్ట్ పడింది. ఎండ మండిపోవడంతో పెద్దగా జనం మార్కెట్‌కు రాలేదు. దీంతో, మార్కెట్ ప్రాంతం జనం లేక బోసిపోయింది. ఎండ తీవ్రతకు వ్యాపారులు సైతం అల్లాడిపోయారు. కూరగాయల వ్యాపారులు చిన్నచిన్న కమ్మల పాకల్లోనూ, చిరు వ్యాపారులు నెత్తిన గొడుగులు వేసుకుని కూరగాయలు విక్రయిస్తూ ఎండ దెబ్బకు గురయ్యారు.

కొనుగోలుదారులు లేక బోసిపోయిన సంత

రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు

మాట్లాడుతున్న ఎఒ సరోజిని

ప్రజాశక్తి- కోటవురట్ల:ఎకరాకు పది కిలోల చొప్పున 50శాతం రాయితీపై పచ్చి రొట్ట విత్తనాలు అందజేస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారిని సరోజిని తెలిపారు. మండల వ్యాప్తంగా రైతుభరోసా కేంద్రాలలో జీలుగ, జనుము పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉంచామ న్నారు. విలేకర్లతో ఆమె మాట్లాడుతూ, అధిక దిగుబడి కోసం రసాయనిక ఎరువులు మోతాదుకు మించి వాడటంతో దిగుబడి పెరగకపోగా పోషకాలు దెబ్బతిని భూమి నిస్సారం వుతుందని తెలిపారు. రైతులు సేంద్రియ ఎరువులు వాడటం ఎంతైనా మంచిదన్నారు. ప్రధాన పంటకు సాగుకు ముందు జీలుగ, జనుము, పిల్లి పెసర వంటి పచ్చిరొట్ట ఎరువులు సాగు చేపట్టాలన్నారు. పచ్చిరొట్ట ఎరువులతో భూమిలో నీటిని, పోషకాలను నిలిపే సామర్థ్యం ఏర్పడుతుందన్నారు. ఆసక్తి గల రైతులు పట్టాదార్ పాస్ పుస్తకం, ఆధార్ కార్డు తీసుకుని రైతు భరోసా కేంద్రాల వద్ద విత్తనాలు కొనుగోలు చేసుకోవాలన్నారు.

మాట్లాడుతున్న ఎంపిడిఒ శ్రీనివాస్

పింఛనుదారులకు ఇబ్బంది రానీయొద్దు

ప్రజాశక్తి-నక్కపల్లి: పింఛను లబ్ధిదారులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పింఛన్ నగదు పంపిణీ ఏర్పాటు చేయాలని ఎంపీడీవో శ్రీనివాస్ అన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం ఈఓపిఆర్‌డి సత్యనారాయణ, ఏవో సీతారామరాజు లతో కలిసి పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. జూన్ 1వ తేదీన పింఛన్ తీసుకునేందుకు బ్యాంకుల వద్దకు వచ్చే లబ్ధిదారులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఎండ తీవ్రతను దృష్టిలో పెట్టుకొని బ్యాంకుల వద్ద టెంట్లు ఏర్పాటు చేయాలని, తాగు నీటిని అందుబాటులో ఉంచాలని సూచించారు. నడవలేని స్థితిలో ఉన్న వృద్ధులకు, వికలాంగులకు సచివాలయ ఉద్యోగులు సకాలంలో పింఛన్ నగదు అందజేయాలన్నారు. సచివాలయ సిబ్బంది ప్రతిరోజు యూనిఫాం ధరించాలని, కార్యాలయాల్లో అందుబాటులో ఉండాలన్నారు. ఈ సర్వీసెస్ అమౌంట్ వెంటనే జమ చేయాలని సూచించారు.

ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

పోస్టల్ బ్యాలెట్ లెక్కింపునకు పక్కా ఏర్పాట్లు

ప్రజాశక్తి -ఎంవిపి.కాలనీ : పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపునకు పక్కా ఏర్పాట్లు చేయాలని, ఎక్కడా ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత విభాగాల అధికారులను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున ఆదేశించారు. జూన్ 4వ తేదీన జరగనున్న ఓట్ల లెక్కింపు నేపథ్యంలో ఏయూ ఇంజనీరింగ్ కళాశాల పరిధిలో ఓట్ల లెక్కింపు కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ క్రమంలో ఈఈఈ బ్లాక్ లో ఏర్పాటు చేసిన పార్లమెంటు పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు కేంద్రంలో జరుగుతున్న ఏర్పాట్లను శుక్రవారం పరిశీలించి అక్కడ అధికారులకు పలు సూచనలు చేశారు. పోలైన ఓట్లకు అనుగుణంగా టేబుళ్లను ఏర్పాటు చేయాలని, సిబ్బందిని అందుబాటులో ఉంచాలని సూచించారు. బ్యాలెట్లను ఒక చోట వేసి వేరు చేసే విధంగా అవసరమైన సామగ్రిని సమకూర్చి పటిష్ట ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. కౌంటింగ్ కేంద్రం చుట్టూ పటిష్టమైన మెస్ ఏర్పాటు చేయాలని, ఏజెంట్లు కూర్చునేందుకు అనుగుణంగా కుర్చీలు వేయాలని చెప్పారు. ఆయనతో పాటు పోలీసు జాయింట్ కమిషనర్ ఫక్కీరప్ప, జిల్లా రెవెన్యూ అధికారి కె. మోహన్ కుమార్, ఆయా నియోజకవర్గాల ఆర్వోలు, ఎన్నికల విభాగం అధికారులు ఉన్నారు.

స్ట్రాంగ్ రూమ్‌లు తనిఖీ

ఏయూ ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్లను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా.ఎ. మల్లికార్జున, పోలీస్ జాయింట్ కమిషనర్ ఫక్కీరప్పతో కలిసి తనిఖీ చేశారు. శుక్రవారం ఉదయం స్ట్రాంగ్ రూమ్ల వద్దకు వెళ్లిన వారు అక్కడ మూడంచెల భద్రతాపరమైన చర్యలను పరిశీలించారు. అన్ని చోట్లా భద్రతా పరమైన పరిస్థితులు సరిగ్గా ఉన్నాయా లేదా అనే అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి తగిన జాగ్రత్తలు సూచించారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద అమర్చిన సీసీ టీవీల పనితీరు, మానిటరింగ్ రూమ్ నుంచి జరుగుతున్న పర్యవేక్షణ తీరును పరిశీలించారు. అనంతరం వారిద్దరూ లాగ్ బుక్‌లలో సంతకాలు చేశారు. వారి వెంట ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు ఉన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా...

అక్రమ లేఅవుట్లు

చదును చేసిన లే అవుట్

ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా మండలంలో అక్రమ లేఔట్లు జోరుగా కొనసాగుతున్నాయి. ఇతర ప్రాంతాల నుండి భూముల కొనుగోలుదారులు వచ్చి ప్రభుత్వ భూముల కొండలు, వాగులు ఉన్న పరిసర ప్రాంతాల్లో భూములను కొనుగోలు చేస్తున్నారు. వాటిని చదును చేసే సమయంలో ప్రభుత్వ భూములను, కొండలను, గెడ్డలను కలిపి చదును చేసుకుని లేఅవుట్లు వేస్తూ దర్జాగా విక్రయాలు చేస్తున్నారు. వీటిని నిరోధించాల్సిన అధికారులు ఫిర్యాదు అందకపోవడం తమకు సమాచారం లేదని చూసీ చూడనట్లు వ్యవహరించడంతో ఈ అక్రమ లేఔట్‌ల జోరు రోజురోజుకు పెరుగుతోంది.

-అనుమతులు లేకుండా బ్లాస్టింగ్, చదును పనులు
-సమాచారం అందడంతో పరిశీలించిన తహశీల్దార్

ప్రజాశక్తి- చీడికాడ చీడికాడ రెవెన్యూ సర్వే నెంబర్ 119, 120లో గల సుమారు 20 ఎకరాల భూమిని కొనుగోలుదారులు చదును చేసి రహదారులు నిర్మించి లేఅవుట్లుగా తయారు చేశారు. కొండ సమీపాన ఉన్న ఈ భూమిలో భారీ రాతి బండలు ఉండటంతో ఎటువంటి అనుమతులు తీసుకోకుండానే బ్లాస్టింగ్లు సైతం నిర్వహించారంటే పరిస్థితి ఏ విధంగా ఉందో ఇట్టే ఊహించవచ్చు. నిబంధనలకు విరుద్ధంగా బ్లాస్టింగ్లు చేయరాదు, సాగు భూములను వ్యవసాయేతర భూమిగా మార్చాలంటే రెవెన్యూ శాఖ నుండి (ఆర్డీవో,) సిఎల్‌యు పత్రం పొందాల్సి ఉంది. అంతే కాకుండా వాటికి రహదారి నిర్మించాలన్నా, విద్యుత్ సౌకర్యం కల్పించాలన్నా రెవెన్యూ, పంచాయతీ అనుమతులు పొందాల్సి ఉంది. భూమి చదును చేసేందుకు, రహదారులు నిర్మించేందుకు అనుమతులు తీసుకోవాల్సి ఉంది. కానీ ఎటువంటి అనుమతులు లేకుండా సమీపాన ఉన్న అరగలమెట్ట (అరగలమెట్టకొండను) తవ్వి గ్రావెల్ తరలించి రహదారులు నిర్మించారు. సుమారు 20 ఎకరాల భూమిలో రహదారులు నిర్మించేందుకు ఎంత గ్రావెల్ పడుతుందో ఎంత గ్రావెల్ను అక్రమంగా తరలించి పోయారన్నది కళ్ళకు కట్టినట్లు కనిపిస్తున్నా సంబంధిత అధికారులు చూసి చూడనట్లు వ్యవహరించడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

విశాఖకు చెందిన ఓ ప్రజాప్రతినిధి కొనుగోలు చేశారని, దానికి ఈ ప్రాంత మంత్రి సహాయ సహకారాలు ఉన్నాయని, దీంతో ఈ ప్రాంతంలో ఉన్న అధికారులు, ప్రజాప్రతినిధులు సైతం నోరు మెదపడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. రెవెన్యూ కార్యాలయానికి కేవలం సుమారు రెండు కిలోమీటర్ల దూరంలోనే ఇంతలా లేఅవుట్లు ఏర్పాటుకు భారీ రాతిబండలను బ్లాస్టింగ్లు చేసి ప్రభుత్వ భూమిలో గ్రావెల్ను తరలించి రోడ్లు నిర్మిస్తే అధికారులకు తెలియకపోవడం పై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.భూమి చదును చేసి రహదారులు నిర్మించి ప్లాట్లకు సర్వే రాళ్లు పాతి పెట్టడం అందరిని ఆశ్చర్యానికి గురి చేసింది. ప్రస్తుతం అధికారులను తప్పుదోవ పట్టించేందుకు అందులో విలువైన మొక్కలను నాటుతున్నారు. కొన్నాళ్ల అనంతరం వాటిని తొలగించి ప్లాట్లుగా విక్రయించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారని ఆరోపణలు లేకపోలేదు. ఈ ప్రాంతంలో ఉన్న కొండగడ్డను సైతం ఆక్రమించి చదును చేసి పంట కాలువల మార్చిన సంఘటన కళ్ళకు కట్టినట్లుగా కనిపిస్తుంది. సాగు భూమిని చదును చేసి లేఅవుట్లుగా మార్చాలంటే ముందుగా అనుమతులు తీసుకోవాలి. ఇక్కడ ఎటువంటి అనుమతి పత్రాలు లేకుండా పనులను చక చక చేసుకు పోతున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు స్పందించక పోవడంపై సర్వత్ర విమర్శలు వెల్లు వెత్తుతున్నాయి.

నిబంధనలు పాటించకుంటే చర్యలు

తహశీల్దార్ ప్రకాశరావు

ఈ విషయాన్ని తెలుసుకున్న విలేకరుల బృందం సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించిన అనంతరం చీడికాడ తహసిల్దార్ ప్రకాశరావుకు తెలియజేశారు. మండల కేంద్రంలోని చీడికాడ రెవెన్యూ పరిధి బంధమామిడి ప్రాంతంలో జరుగుతున్న లేఅవుట్ల నిర్మాణ పనులను తహశీల్దార్ పరిశీలించారు. సుమారు 20 ఎకరాల్లో లేఅవుట్లు వేసి, రహదారులు నిర్మించి ఉండడాన్ని పరిశీలించారు. ఆ ప్రాంతంలో ఉన్న వాచ్‌మెన్‌ను పిలిచి విచారించగా సూపర్వైజర్ వస్తారని తెలిపాడు. సూపర్వైజర్‌తో ఫోన్లో తహసిల్దార్ మాట్లాడారు. ఈ లే అవుట్లకు సంబంధించిన రికార్డులను, దస్త్రాలను పట్టుకుని కార్యాలయానికి రావాలని సూపర్వైజర్ కు తెలిపారు.భూమి ఆక్రమణకు గురైనట్లు గుర్తించామని సర్వే జరిపి నిర్ధారణ చేయడం జరుగుతుందని తెలిపారు. అనుమతులు తీసుకోకుండా లే అవుట్‌లు వేస్తే చర్యలు తప్పవని,దీనిపై రోలర్ సర్వే నిర్వహించడం జరుగుతుందన్నారు.

లే అవుట్‌ను పరిశీలిస్తున్న తహశీల్దార్

ఉపాధి హామీ కూలీలకు ...

రోజు వేతనం పెంచాలి : సిపిఎం

ప్రజాశక్తి -కొత్తకోట: ఉపాధి హామీ కూలీలకు రోజు వేతనం పెంచాలని సిపిఎం జిల్లా కార్య వర్గ సభ్యులు కె. గోవిందరావు డిమాండ్ చేశారు. ఆరు రోజుల పనికి ఆరు రోజులు కూలి ఇవ్వలేదని, ఆరు రోజులు పని చేస్తే 4 రోజులు మాత్రమే కూలి ఇస్తున్నారని విమర్శించారు. రావికమతం మండలం టి.అర్జాపురం శివారు డోలవానిపాలెం గ్రామంలో ఉపాధి హామీ కూలీలతో శుక్రవారం సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా గోవిందరావు మాట్లాడుతూ, రావికమతం మండలంలో 12 పంచాయితీలలో 41 గ్రామాల్లో 670 మంది ఉపాధి హామీ పథకం పై జాబ్ కార్డులు కలిగి ఉన్నారని పేర్కొన్నారు. వీరికి అటవీ హక్కులు పట్టాలు 2011లో 180 మందికి పట్టాలు ఇచ్చారని, 2022 లో మరో 500 మందికి ఆర్ఓఎఫ్ ఆర్ పట్టాలిచ్చారన్నారు. జాబ్ కలిగిన ప్రతి ఒక్కరికి 150 పని దినాలు కల్పించాలని చట్టం చెబుతున్నా నాన్ షెడ్యూల్ ప్రాంతంలో ఈ చట్టం అమలు కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ సమస్య పై ఉపాధి హామీ పథకం అధికారులకు ఫిర్యాదు చేయగా ఎటువంటి స్పందన లేదని గోవిందరావు దుయ్య బట్టారు. టీ.అర్జాపురం శివారు కోట్నాబెల్లి పంచాయితీ పరిధిలో ఐదు గిరిజన గ్రామాల్లో నేటికీ ఇటువంటి పరిస్థితి కొనసాగుతోందన్నారు. నిత్యావసర ధరలు రోజు రోజుకి పెరిగిపోతున్నా కూలీ రేట్లు మాత్రం రోజు రోజుకి దిగ జారి పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కూలి గిట్టు బాటు కాక ఇతర రాష్ట్రాలకు వలసలు వెళ్లడంతో అనేక ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ఉపాధి హామీ పథకం ఆరు రోజుల పనికి ఆరు రోజులు కూలి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

జిల్లా ప్రాజెక్ట్ అధికారులు ఆదివాసి ఉపాధి కూలీల సమస్యలు పరిష్కారం చేయాలని, లేకుంటే జూన్ 10న రావికమతం ఎంపీడీవో కార్యాలయం వద్ద భారీ ఎత్తున ఆందోళ న నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం నాయకు లు సింగారపు వలసయ్య తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం నేత గోవిందరావు

కేకు కట్ చేస్తున్న వాసుపల్లి

ఘనంగా కృష్ణ జయంతి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్: సూపర్ స్టార్ కష్ణ, మహేష్ బాబు ఫ్యాన్ గా ఉండటమే ఒక అదష్టమని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ అన్నారు. విశాఖ సిటీ కృష్ణ, మహేష్ బాబు ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం కళా ప్రపూర్ణ, పద్మ భూషణ్, సూపర్ స్టార్ కృష్ణ జయంతి వేడుకలు సరస్వతి పార్కు జంక్షన్ వద్ద వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా అభిమానులు భారీ కేక్ కట్ చేసి అనంతరం అన్న సంతర్పణ చేపట్టారు. అనంతరం ఎమ్మెల్యే గణేష్ కుమార్ మాట్లాడుతూ కృష్ణ అభిమానుల కోరిక మేరకు విశాఖలో రెండు చోట్ల సూపర్ స్టార్ కృష్ణ కాంస్య విగ్రహం ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో ఎన్నికల కోడ్ అడ్డొచ్చిందన్నారు. మరోసారి తాను ఎమ్మెల్యేగా, రాష్ట్రంలో వైసిపి అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ రుణం తీర్చుకుంటామన్నారు.